సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 18.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 288
పేజీలు: 08 వెల: రూ. 5

## క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ 03

- భువనగిరిలో ముగిసిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ మీటింగ్..
- హాజరైన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, అడ్లూరి



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై

## కీలక ప్రకటన

ఆ పథకాలను రద్దు చేయబోం 03

- స్టేపై డివిజన్ బెంచ్ ను ఆశ్రయిస్తున్నాం
- గత ప్రభుత్వ లోపభూయిష్టమైన జీవో వల్లే చిక్కులు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం



## తొలిరోజే అసెంబ్లీలో వాడివేడి

ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం 02

- మెగా డీఎస్సీపై వైసీపీ వాయిదా తీర్మానం
- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్
- లోకేష్ రాజీనామా చేయాలంటూ వైసీపీ డిమాండ్
- కూటమి సర్కార్‌పై వైసీపీ ఎమ్మెల్సీల ఫైర్



## టిమ్స్ హాస్పిటల్ ప్రారంభం 02

ప్రారంభించిన సీఎం రేవంత్

సనత్ నగర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్‌గా నామకరణం

రూ.1,100 కోట్లతో.. 1,000కిపైగా పడకలు!



పాత్రికేయ విలువలకే

## ప్రాధాన్యం

ప్రింట్ మీడియాకు ఢోకా లేదు



- వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలి
- 'పత్రికా రంగం`నాడు`నేడు' సదస్సులో వక్తలు 06
- జర్నలిస్టుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ కేశినేని
- ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ వార్షికోత్సవం

కేసీఆర్ క్రెడిట్ కాంగ్రెస్

## కొట్టేసింది

టిమ్స్ ఆలోచన కేసీఆర్ ది.. ప్రచారం కాంగ్రెస్ ది! 02



- టిమ్స్ ఆస్పత్రుల్లో పూర్తి వైద్య సేవలు లేకుండానే ప్రారంభోత్సవాలు
- పేదల నుంచి ఫీజుల వసూలు కేసీఆర్ లక్ష్యాలకు విరుద్ధం
- ఆస్పత్రుల నిర్మాణ చరిత్రను మార్చలేరు
- మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజం




## బీజేపీకి కొత్త రక్తం

జాతీయ కార్యవర్గంలో ఏపీకి పెద్దపీట

- జాతీయ ఉపాధ్యక్షురాలిగా వసుంధర రాజే
- జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీ
- రాంమాధవ్, పురందేశ్వరికి అవకాశం
- జాయింట్ కో ఆర్డినేటర్ విష్ణుకుమార్ రాజు

**ముద్ర డెస్క్ :**
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన కొత్త జాతీయ కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ కొత్త టీమ్‌ను వెల్లడించారు. ఇందులో మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి కీలకమైన జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ స్థానం నుంచి ఓటమి తర్వాత సుమారు రెండేళ్లకు పైగా వ్యవధిలో ఆమె మళ్లీ పార్టీ జాతీయ సంస్థాగత వ్యవస్థలో కీలక పాత్రలోకి వచ్చారు.
మరో కీలక నియామకం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌కు దక్కింది. ఆయనను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కశ్మీర్‌లో బీజేపీ సంస్థాగత, రాజకీయ విస్తరణలో రామ్ మాధవ్ గతంలో కీలకంగా పనిచేశారు.
నితిన్ నబీన్ రూపొందించిన కొత్త టీమ్‌లో అనుభవజ్ఞులతో పాటు యువ నేతలకు కూడా ప్రాధాన్యం లభించింది. మొత్తం 13 మంది జాతీయ ఉపాధ్యక్షులను నియమించారు. వీరిలో వసుంధర రాజే సింధియా, రామ్ మాధవ్, పురంధేశ్వరి, బైజయంత్ జయ్ పాండా, డి. పురంధేశ్వరి, రేఖా వర్మ, భారతి పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్ తదితరులు ఉన్నారు. మిగతా 02లో

## ఓటర్లకు నోటీసులు

- 92 లక్షల మందికి అందజేత
- తెలంగాణలో సర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల..
- ఓటర్ల జాబితాలో భారీ సవరణలు

### 9.22 లక్షల మంది మృతిచెందారని గుర్తింపు

- 6.70 లక్షల డూప్లికేట్ ఓట్లు
- ఓటర్ల జాబితాపై భారీ కసరత్తు
- అక్టోబర్ 19న తుది జాబితా
- డూప్లికేట్ ఓట్లకు చెక్



**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో కీలకమైన ఎన్యుమరేషన్ దశ పూర్తైంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,38,26,448 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయగా.. 2,64,87,213 మంది ఫారాలను పూర్తి చేసి సమర్పించారు. అంటే 78.30 శాతం మంది ఓటర్ల నుంచి ఫారాలు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్యుమరేషన్ డేటా పరిశీలనలో 9,22,229 మంది మరణించినవారిగా గుర్తించారు. మరో 57,46,803 మంది శాశ్వతంగా తరలివెళ్లిన వారు, గైర్హాజరు లేదా ఇతర కేటగిరీల్లో ఉన్నట్లు తేలింది. అలాగే 6,70,203 మంది ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదై ఉన్నట్లు గుర్తించారు. మల్టిపుల్ ఎన్‌రోల్‌మెంట్ ఉన్న వారి పేర్లను ఒక్కచోటే కొనసాగించనున్నారు.

**92 లక్షల మందికి నోటీసులు**
డేటా పరిశీలనలో సుమారు 60 లక్షల మంది ఓటర్ల విషయంలో అనామలీస్ గుర్తించగా.. మరో 32 లక్షల మంది సరైన మ్యాపింగ్ చేసుకోలేదని అధికారులు గుర్తించారు. దీంతో మొత్తం 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నారు. నోటీసుల్లో ఏ కారణంతో జారీ చేస్తున్నారో స్పష్టంగా పేర్కొంటామని అధికారులు తెలిపారు. సంబంధిత గుర్తింపు, ధ్రువీకరణ పత్రం సమర్పించి ఓటు క్రమబద్ధీకరించుకోవాల సూచించారు.
నెల రోజుల పాటు క్లెయిమ్స్, అభ్యంతరాలు ముసాయిదా జాబితాలో పేర్ల తొలగింపు, మార్పులు లేదా ఇతర అంశాలపై ప్రజలు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు మిగతా 02లో

- ఈ కారణంతో ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దు
- జాప్యం చేయకుండా సమస్యలను పరిష్కరించాలి 02



22-A వివాదంపై

## ఆందోళన వద్దు

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు

- నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేయాలి
- నిషేధిత జాబితాలోకి ఎందుకొచ్చిందో పరిశీలించాలి

ఓపిక నశిస్తే జీవన్‌రెడ్డిలా

## తిరగబడతా

కాంగ్రెస్‌లో చిన్నారెడ్డి చిచ్చు

- కోట్లు తిని టికెట్ అమ్ముకున్నారు
- కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- సోనియా చెప్పినా టికెట్ ఇవ్వలేదు



**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. సొంత పార్టీకి చెందిన సీనియర్ నేతలే పార్టీ నాయకత్వం, ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై బహిరంగంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. తనకు ఓపిక నశిస్తే సీనియర్ నేత జీవన్‌రెడ్డి మాదిరిగా తిరగబడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.
పార్టీ నేతల సమక్షంలో తన ఆవేదనను వ్యక్తం చేసిన చిన్నారెడ్డి.. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. డబ్బులు వెచ్చించి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారని, వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను అవినీతిమయంగా మార్చారని ఆరోపించారు. తన అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారని, తన అనుచరులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

**సోనియా చెప్పినా టికెట్ ఇవ్వలేదంటూ..**
తనకు వనపర్తి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ అప్పట్లో రేవంత్‌రెడ్డికి సూచించారని చిన్నారెడ్డి తెలిపారు. తన వద్ద ఎన్నికల ఖర్చుకు డబ్బు లేకపోతే పార్టీ తరపునే ఖర్చు చేయాలని ఆమె చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే ఎన్నికల కమిటీలోని కొందరు నేతలు మిగతా 02లో

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం, 18.08.2026
www.mudranews.in | @mudranews



**బలహీనత, నీరసంకు బాదం, వేరుశెనగలు**



బాదం, వేరుశెనగలు వంటి గింజల్లో మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్ వంటి పోషకాలు ఉంటాయి. రోజువారీ ఆహారంలో తగిన మోతాదులో వీటిని చేర్చుకోవచ్చు.

## 92 లక్షల మంది ఓటర్లకు
# నోటీసులు



(మొదటి పేజీ తరువాయి)
చేయవచ్చు. వీటిని ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అధికారులు పరిశీలిస్తారు. అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫామ్–6, ఓవర్సీస్ భారతీయుల నమోదుకు ఫామ్–6A, తప్పుడు చేర్పులపై అభ్యంతరాలు లేదా తొలగింపులకు ఫామ్–7, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణలకు ఫామ్–8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

**35,985 పోలింగ్ కేంద్రాల్లో ప్రక్రియ**

రాష్ట్రవ్యాప్తంగా 35,985 పోలింగ్ స్టేషన్లలో బూత్ స్థాయిలో ఎన్యుమరేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో 49,018 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు) భాగస్వామ్యం చేశారు. వీరిలో కాంగ్రెస్ 13,144, బీఆర్ఎస్ 20,394, బీజేపీ 11,621, ఏఐఎంఐఎం 2,382, సీపీఎం 608, బీఎస్పీ 569, టీడీపీ 300 మంది ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, పేదలు, ఇతర బలహీన వర్గాల ఓటర్లకు ప్రత్యేక సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ముసాయిదా జాబితాను ERO, AERO కార్యాలయాలు, సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు పరిశీలించుకోవచ్చని సూచించారు. ముసాయిదా జాబితా విడుదలతో SIR ప్రక్రియలో మరో కీలక దశ పూర్తికాగా.. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ 19న వెలువడే తుది జాబితాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# బీజేపీకి కొత్త రక్తం



(మొదటి పేజీ తరువాయి)
జాతీయ ప్రధాన కార్యదర్శులుగా వినోద్ తావ్డే, సునీల్ బన్సల్, బిప్లబ్ కుమార్ దేబ్, స్మృతి ఇరానీ, సతీశ్ పూనియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియా నియమితులయ్యారు. సంస్థాగత విభాగంలో బి.ఎల్. సంతోష్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థ)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థ)గా బాధ్యతలు చేపట్టనున్నారు.
కొత్త కార్యవర్గంలో 16 మంది జాతీయ మంత్రులను కూడా నియమించారు. కవితా పాటీదార్, సురేంద్రన్, డాక్టర్ భోలా సింగ్, డాక్టర్ ప్రదీప్ వర్మ, జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్, డాక్టర్ సందీప్ పాఠక్, ఫాంగ్నోన్ కోన్యాక్, సంగీత యాదవ్, అనిల్ ఆంటోనీ, డాక్టర్ వెంకటేశన్, మనోజ్ టిగ్గా, సిద్ధార్థ్ శంభు, డాక్టర్ స్వదేశ్ సింగ్, మృగాంక దేవ్ బర్మన్, రోహన్ గుప్తా, జయ ప్రకాశ్ ఈ జాబితాలో ఉన్నారు. పార్టీ ఆర్థిక వ్యవహారాల్లోనూ మార్పులు చేసింది. మహారాష్ట్రకు చెందిన పీయూష్‌గోయల్‌ను జాతీయ కోశాధికారిగా నియమించగా, రాజస్థాన్‌కు చెందిన రాజేశ్ మంగళ్‌ను జాతీయ సహ–కోశాధికారిగా నియమించారు. తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.
నితిన్ నవీన్ 46 ఏళ్ల వయసులో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా నిలిచారు. ఆయన నాయకత్వంలో ప్రకటించిన ఈ పునర్వ్యవస్థీకరణలో యువత, మహిళలకు మరింత ప్రాతినిధ్యంతో పాటు అనుభవజ్ఞుల కొనసాగింపునకు ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.
ఈ మార్పులకు రాజకీయంగా కూడా ప్రాధాన్యం ఉంది. 2027లో ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, గోవా సహా పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు నీట్ వివాదంపై విద్యార్థుల ఆందోళనలు ఇటీవల కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కొత్త కార్యవర్గం ఏర్పాటు కేవలం సంస్థాగత మార్పుగా కాకుండా రాబోయే ఎన్నికల కోసం పార్టీ సన్నద్ధతలో భాగంగా కూడా పరిశీలనకు వస్తోంది.
మొత్తంగా, రాష్ట్రాల వారీగా నాయకులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ సంస్థాగత అనుభవం, యువ నాయకత్వం, మహిళా ప్రాతినిధ్యాన్ని సమన్వయం చేసేలా బీజేపీ కొత్త టీమ్‌ను రూపొందించింది.

# ప్రజలు ఆందోళన చెందవద్దు

**ముద్ర, హైదరాబాద్ :**
22–A వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. 22–A బూచి పేరు మీద ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 22–A జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్తులు 22–A జాబితాలో పెట్టిన అంశం మా దృష్టికి వచ్చింది. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22–A కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22–A జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'..
'ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయి' అని అన్నారు.

# టిమ్స్ ఆస్పత్రి ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్ ఎర్రగడ్డలో నిర్మించిన మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డా.ఎంసీఆర్ టిమ్స్) సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో నిర్మించిన ఈ ఆసుపత్రి నగరంలోని ప్రభుత్వ వైద్య రంగంలో కీలకంగా మారనుంది.





**22.6 ఎకరాల్లో.. రూ.1,100 కోట్ల వ్యయం**

టిమ్స్ సనత్‌నగర్ ఆసుపత్రిని మొత్తం 22.6 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఇందుకోసం సుమారు రూ.1,100 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. మొత్తం 1,000 పడకల సామర్థ్యంతో ఆసుపత్రిని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఆసుపత్రిలో ఐదు ప్రధాన బ్లాకుల్లో అవసరమైన వైద్య, పరిపాలనా, రోగుల సేవలకు సంబంధించిన సదుపాయాలను సిద్ధం చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ట్రయల్ రన్‌తో సేవలకు శ్రీకారం**

ఆసుపత్రి పూర్తి స్థాయిలో ప్రారంభానికి ముందు ట్రయల్ రన్ నిర్వహించారు. డే కేర్ విభాగాలను కూడా ప్రయోగాత్మకంగా ప్రారంభించి రోగులకు సేవలు అందించారు. ఈ దశలో రోజుకు సుమారు 250 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆసుపత్రిలోని వైద్య విభాగాలు, సిబ్బంది, పరికరాలు, రోగుల సేవల ప్రక్రియలను పరిశీలించే అవకాశం లభించింది. పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి.

**కీలక బాధ్యతల్లో అధికారులు**

టిమ్స్ సనత్‌నగర్ నిర్వహణ కోసం ప్రభుత్వం కీలక నియామకాలు చేసింది. మాజీ డీఎంఈ డా. ఎ. నరేంద్రకుమార్‌ను ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా నియమించింది. మాజీ ఏడీఎంఈ డా. మహబూబ్ ఖాన్‌ను ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించింది. వీరి పర్యవేక్షణలో ఆసుపత్రి వైద్య సేవలు, పరిపాలన, సిబ్బంది సమన్వయం వంటి అంశాలు కొనసాగనున్నాయి.

**గాంధీ, ఉస్మానియా, నిమ్స్ నుంచి సిబ్బంది**

టిమ్స్ సనత్‌నగర్‌లో వైద్య సేవల కోసం ఇప్పటికే సిబ్బందిని సిద్ధం చేశారు. గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, నిమ్స్ నుంచి కొంతమంది సిబ్బందిని తీసుకున్నారు. వీరితో పాటు ఇటీవల కొత్తగా సుమారు 200 మంది వైద్య సిబ్బందిని రిక్రూట్ చేశారు. వైద్యులు, నర్సింగ్, ఇతర ఆరోగ్య సేవల సిబ్బంది అందుబాటులో ఉండటంతో ఆసుపత్రిని దశలవారీగా పూర్తి సామర్థ్యంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**కార్పొరేట్‌కు ధీటుగా వసతులు..**

పేద, మధ్యతరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ తరహా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దారు. 1082 పడకల సామర్థ్యంతో రూపుదిద్దుకున్న ఈ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ కోసం ప్రత్యేకంగా 300 ఐసీయూ పడకలు, సంక్లిష్టమైన సర్జరీల కోసం 31 అత్యాధునిక మేజర్ ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశారు. నిన్నటివరకు సాధారణ ఓపీ సేవలు, ట్రయల్ రన్ మాత్రమే కొనసాగగా.. నేటి ప్రారంభోత్సవంతో పూర్తిస్థాయి సూపర్ స్పెషాలిటీ సేవలు అధికారికంగా రోగులకు అందుబాటులోకి రానున్నాయి.

**సమగ్ర వైద్యం.. ఒకే ప్రాంగణం**

గుండె, కిడ్నీ, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులతో పాటు అత్యవసర ట్రామా, క్యాన్సర్, అవయవ మార్పిడి వంటి 37 ప్రధాన వైద్య విభాగాలకు చెందిన నిపుణులు ఇక్కడ సేవలు అందించనున్నారు. కార్డియాక్, రీనల్, న్యూరో, ట్రామా వంటి కీలక రంగాల్లో ప్రత్యేక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలతో పాటు అధునాతన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు రోగులకు వేగవంతమైన వైద్య పరీక్షలను అందించనున్నాయి. ఈ భారీ ప్రాజెక్టు ప్రారంభంతో రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే రోగులకు గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌లపై ఉండే భారం తగ్గి, నాణ్యమైన స్పెషాలిటీ వైద్యం మరింత చేరువకానుంది.

# తొలిరోజే అసెంబ్లీలో వాడివేడి

**ముద్ర, అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. నేటి నుంచి 4 రోజులపాటు ఈ సెషన్‌లో కీలక అంశాలపై చర్చ జరగనుంది. తొలిరోజున ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో మొదలయ్యాయి. సభలో ప్రజా సమస్యలు, వివిధ శాఖల సమర్థతపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానాలు ఇస్తున్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం మొత్తం 7 కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. సోమవారం ఉదయం 10:30 గంటల తర్వాత లంచ్ బ్రేక్ సమయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) భేటీ కానుంది. ఈ సమావేశాలు ఎన్ని రోజుల పాటు నిర్వహించాలి, సభలో ఏయే ముఖ్యమైన అంశాలపై చర్చించాలనే విషయాలపై ఈ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ వర్షాకాల సమావేశాలు నాలుగు రోజుల పాటు నిర్వహించే అవకాశముంది.

**శాసనమండలిలో వైసీపీ ప్రశ్నల వర్షం**

ఎగ్జామ్ లేకుండానే డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చారని వైసీపీ సభ్యులు ఆరోపించారు. మెగా డీఎస్సీలో అవకతవకలపై చర్చ జరగాలని వాయిదా తీర్మానం ఇచ్చారు. కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు చెబుతున్నారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ దానిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (CBI) ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని ప్రతిపక్షం గట్టిగా డిమాండ్ చేస్తోంది. అదేవిధంగా ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోంది. ఉదయం 10 గంటలకు శాసనమండలి ప్రారంభమైంది. శాసన మండలి ప్రారంభానికి ముందు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు నిరసన ప్రదర్శనగా మండలిలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. డీఎస్సీ ప్రక్రియలోని లోపాలపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కల్పలత, రామాంజనేయులు (రామచంద్రారెడ్డి) మండలి చైర్మన్‌కు వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, వరుదు కళ్యాణి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. డీఎస్సీలో జరిగిన అవకతవకలపై నిష్పక్షపాత విచారణ సాగాలంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని, పూర్తి వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి అనుకూలంగా మరియు తమకు నచ్చిన రీతిలో నిబంధనలను, జీవోలను సవరించడం ఎంత వరకు న్యాయమని నిలదీశారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగికి మొదటి ర్యాంక్ రావడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని, మంత్రి తీరు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

# చిన్నారెడ్డి చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)
డబ్బులకు ఆశపడి తనకు టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. వనపర్తిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అడ్డంకులు సృష్టిస్తున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఐటీ టవర్ నిర్మాణంతో పాటు నర్సింగాయిపల్లి పీజీ కేంద్రంలో బాలికల కోసం రూ.9 కోట్లతో, బాలు ర కోసం రూ.15 కోట్లతో నిర్మించాల్సిన హాస్ట ళ్ల పనులు ముందుకు సాగడం లేదని చెప్పారు. ఈ విషయంపై సంబంధిత శాఖల మం త్రులు, అధికారులను తానే స్వయంగా ప్రశ్నించినట్లు తెలిపారు. అయితే ఆయా పనులకు ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారని, కాంట్రాక్టర్ తనకు అనుకూలమైన వ్యక్తి కాదనే కారణంతో కాంట్రాక్టును రద్దు చేయించారని అధికారులు చెప్పినట్లు చిన్నారెడ్డి వెల్లడించారు.

**'మరో జీవన్‌రెడ్డిలా మారతా'**

తనకు జరుగుతున్న అవమానాలు, తన పను లకు ఎదురవుతున్న అడ్డంకులు కొనసాగితే ఇక ఓపిక పట్టలేనని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. ఓపిక నశిస్తే సీనియర్ నేత జీవన్‌రెడ్డి మా దిరిగా తాను కూడా తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కలిసి కోట్ల రూపాయలు తిన్నారని, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసి తన రాజకీ య భవిష్యత్తుపై దెబ్బ కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లోనే పలువురు సీనియర్ నేతలు పార్టీ వ్యవహారాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తుండటం చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో చిన్నారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు పార్టీ అంత ర్గత వ్యవహారాలను మరోసారి తెరపైకి తీసుకొచ్చాయి. అయితే చిన్నారెడ్డి చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే మేఘారెడ్డి, పార్టీ నాయకత్వం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# కేసీఆర్ క్రెడిట్ కాంగ్రెస్ కొట్టేసింది

**ముద్ర, హైదరాబాద్:**
కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిన ప్రాజెక్టులను తమ ఖాతాలో వేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారానికే ప్రాధాన్యమిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష డిప్యూటీ లీడర్ తన్నీరు హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టిమ్స్ ఆస్పత్రుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే గొప్ప లక్ష్యంతో టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తోందని మండిపడ్డారు.

**ఓపీకే పరిమితం కావడం సిగ్గుచేటు**
సుమారు వెయ్యి కోట్ల రూపాయల ప్రజాధనంతో అత్యాధునిక సాంకేతికతతో నిర్మించిన ఆస్పత్రుల్లో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించకుండా కేవలం ఓపీ (అవుట్ పేషెంట్) సేవలకు మాత్రమే పరిమితం చేసి ప్రారంభోత్సవాలు చేయడం సిగ్గుచేటని హరీష్‌రావు దుయ్యబట్టారు. అరకొర వసతులతో, సగం సగం సేవలతో ఆస్పత్రులను ప్రారంభించి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని ధ్వజమెత్తారు.

**ఫీజులు వసూలు చేయడం దారుణం**
కేసీఆర్ హయాంలో ఈ ఆస్పత్రుల్లో పేదలకు రూపాయి ఖర్చు లేకుండా పూర్తి ఉచిత వైద్యం అందించాలని నిర్ణయించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల నుంచి ఫీజులు వసూలు చేయాలని చూడటం దారుణమని అన్నారు. పేదలపై ఆర్థిక భారం మోపడం కేసీఆర్ ఆశయాలకు, లక్ష్యాలకు సదా విరుద్ధమని పేర్కొన్నారు. పేరు మార్చినంత మాత్రాన లేదా ప్రచారం చేసుకున్నంత మాత్రాన ఆస్పత్రుల నిర్మాణ వెనుక ఉన్న చరిత్రను, కేసీఆర్ మార్కును తుడిచిపెట్టలేరని స్పష్టం చేశారు.

**వరంగల్ మల్టీ స్పెషాలిటీ, నిమ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలి**
రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వరంగల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, నిమ్స్ (NIMS) కొత్త బ్లాక్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. టిమ్స్ ఆస్పత్రుల్లో తక్షణమే అన్ని విభాగాల్లో పూర్తిస్థాయి ఇన్‌పేషెంట్, అత్యవసర సేవలను అందుబాటులోకి తేవాలని, అలాగే రోగులందరికీ ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సీజేపీ తరహాలో డీఎన్‌పీ

**ముద్ర డెస్క్:**
కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన సోషల్ మీడియా ప్రచారం, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమం సక్సెస్ కావడంతో ఇతర అంశాలపై కూడా ఇదే తరహా నరసనలు ఆన్ లైన్ ఉద్యమాలు పొట్టుకువస్తున్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన బొద్దింకల వ్యాఖ్యలు దేశ రాజకీయాలనే షేక్ చేయగా తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్య్ర దినోత్సం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగం మరో ఆన్ లైన్ ఆందోళకు వేదికగా మారింది.





మోడీ తన స్పీచ్‌లో దిమాగీ నక్సల్స్ అనడం తీవ్ర దుమారం రేపుతోంది. మోడి వ్యాఖ్యలకు కౌంటర్ గా తాజాగా సోషల్ మీడియాలో 'దిమాగీ నక్సల్ జనతా పార్టీ' (DNP) పేరుతో కొత్తగా సెటైరికల్ ఖాతా ప్రత్యక్షం కావడం సంచలనంగా మారింది.

**రాత్రికి రాత్రే భారీగా ఫాలోవర్స్**
వెలుగులోకి వచ్చిన 24 గంటల్లోనే 'దిమాగీ నక్సల్ పార్టీ' ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 2,04,000 (204K) ఫాలోవర్లను సంపాదించి రికార్డు సృష్టించింది. ఈ అకౌంట్‌కు 77 పోస్ట్‌లను పోస్ట్ చేయగా, సుమారు 38 మందిని ఫాలో అవుతోంది. దీంతో సీజేపీ తరహాలోనే దిమాగీ నక్సల్ పార్టీ కూడా ఇప్పుడో ఉద్యమంగా మారుతుందా అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఈ దిమాగీ నక్సల్స్ పార్టీతో పాటు దిమాగీ నక్సల్ జనతా పార్టీ పేరుతో ఉన్న మరొక ఖాతాకు కూడా వేలల్లో ఫాలోవర్లు చేరారు. ఆలోచించండి, పరిశోధించండి, ప్రతిఘటించండి అనే నినాదంతో ఈ ఖాతాలు నడుస్తున్నాయి. ఆగస్టు 2026లో ప్రారంభమైన తమ ఖాతాపై సైబర్ దాడులు జరుగుతున్నాయని, గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారంటూ దిమాగీ నక్సల్ పార్టీ X వేదికగా ఆరోపించింది. తాము భగత్ సింగ్ సిద్ధాంతాలను అనుసరిస్తున్నామని పోస్టులలో వెల్లడించింది.

**మారుతున్న ఉద్యమరూపాలు**
దేశంలో హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గతంలో పెద్దగా తీవ్రస్థాయి ఉద్యమాలేవీ ఊపందుకోలేదు. అయితే, నీట్ పరీక్ష వివాదం తీవ్ర కలకలం రేపిన వేళ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన డిజిటల్ ఆందోళన అనూహ్య విప్లవంగా మారింది. సీజేపీ నేతృత్వంలో సాగిన ఈ ఉద్యమానికి ఊహించని రీతిలో మద్దతు లభించడంతో కేంద్ర ప్రభుత్వం డిఫెన్స్‌లో పడక తప్పలేదు. సీజేపీ పోరాట తీవ్రతకు దిగివచ్చిన మోడీ సర్కార్ ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. కాక్రోచ్‌ల ఉద్యమం సక్సెస్ కావడంతో ఆ వెంటనే సోషల్ మీడియాలో రిజర్వేషన్ హటావో ఆందోళన్(ఆర్‌హెచ్ఏ), ఇథనాల్ బ్లెండెడ్‌కు నిరసనగా ఈ–20 జనతా పార్టీ పేరుతో మరో సెటైరికల్ పార్టీ పుట్టుకు వచ్చాయి. ఈ రెండు అంశాలపై దేశవ్యాప్తంగా మంచి ఆధరణే వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా మోడీ వ్యాఖ్యలకు నిరసనగా దిమాగీ నక్సల్స్ పేరుతో కొత్త ఖాతా పుట్టుకురావడం దేశంలో మారుతున్న ఉద్యమరూపాలకు నిదర్శనం అనే టాక్ వినిపిస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 18.08.2026
www.mudranews.in | @mudranews



**బలహీనత, నీరసంకు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి**

పాలకూర, తోటకూర, మెంతికూర వంటి ఆకుకూరల్లో శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. వీటిని వారంలో పలుమార్లు ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.



## ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం.. చలపతిరావుకు నివాళి



**ముద్ర న్యూస్ బ్యూరో హైదరాబాద్, ఆగస్టు 17:** ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇండి యన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయూ), తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) నాయకులు హైదరాబాద్ జూబ్లీహి ల్స్ లోని మానికొండ చలపతిరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐజెయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఉపాధ్యక్షుడు వై నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు కే సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే కార్యదర్శి కే శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో అస్మితా ఖేలో ఇండియా మహిళల వుషు లీగ్



**ముద్ర , హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని టోలిచౌకిలో అస్మితా ఖేలో ఇండియా మహిళల వుషు లీగ్–హైదరాబాద్ జిల్లా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్ప్రింగ్‌ఫీల్డ్స్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళా క్రీడాకారిణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని షేక్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఫరాజ్ ఉద్దీన్ ప్రారంభించారు. స్ప్రింగ్‌ఫీల్డ్స్ ఎడ్యుకేషన్ సీనియర్ ప్రిన్సిపాల్ హుమేరా హైదర్, డా. వెంకటేశ్వరి క్రీడాకారిణులను ప్రోత్సహించారు. అమేచ్యూర్ వుషు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్, ఏడబ్ల్యూఓఏ ప్రధాన కార్యదర్శి మోడల్ అబ్దుల్ ఖురేషీ, మాజీ అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు బి. జగన్నాథ్ స్వామి పాల్గొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఎం.డి. ఫైసల్, వుషు క్రీడా సంఘాలు, స్ప్రింగ్‌ఫీల్డ్స్ పాఠశాల సహకారంతో పోటీలను నిర్వహించారు. సబ్–జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో చాంగ్‌క్వాన్, జియాన్‌షు, సాండా విభాగాల్లో పోటీలు జరిగాయి. సబ్–జూనియర్ చాంగ్‌క్వాన్‌లో ఉమే హలా, జియాన్‌షులో అలీనా తాజ్వర్ స్వర్ణ పతకాలు సాధించారు. సీనియర్ సాండా 45 కిలోల విభాగంలో నిదా బేగం విజేతగా నిలిచారు. సబ్–జూనియర్ సాండా 39 కిలోల్లో హేమ వర్షన్, 56 కిలోల్లో అక్సా, జూనియర్ 56 కిలోల్లో పాడ్విజా యాదవ్, 65 కిలోల్లో కుల్సుమ్ ముంతాజ్ స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలు తెలంగాణలో మహిళల వుషు క్రీడకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా నిలిచాయి. విజేతలైన క్రీడాకారిణులను నిర్వాహకులు అభినందిస్తూ, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

## టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి పదవీ బాధ్యతలు



**ముద్ర, హైదరాబాద్ :** టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆహార, ఔషదాల నాణ్యత ప్రమాణాలను మరింతగా మెరుగు పరచడానికి ప్రభుత్వం ఆహార భద్రత, ఔషద నియంత్రణ భాగాలను వీలీనం చేసి టీజీ సేఫ్‌గా ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఈ శాఖకు డైరెక్టర్‌గా అవినాశ్ మహంతి డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. టీజీ సేఫ్ ( తెలంగాణ స్టాండర్స్ ఆథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్)గా ఏర్పాటు చేశారు.

## కులగణనలో మున్నూరుకాపులతో పాటు బీసీలందరూ విధిగా నమోదు చేసుకోవాలి

**ఎంపీ వద్దిరాజు పిలుపు**



**ముద్ర, హైదరాబాద్ :** జనాభా లెక్కల సేకరణ సందర్భంగా జరిగే కులగణనలో మున్నురుకాపులతో పాటు బీసీలందరూ విధిగా పాల్గొని తమ కులాన్ని నమోదు చేసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర కోరారు.దేశం బ్రిటీష్ వారి ఏలుబడిలో ఉన్నప్పుడు 1931లో జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణన జరిగిందని,తిరిగిప్పుడు సెన్సెస్ – 2027లో చేపడుతు న్నారన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొని తమ కులాన్ని నమోదు చేసుకోవాల్సిందిగా మున్నూరుకాపులతో పాటు బీసీలందరికి ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.

## కంటోన్మెంట్ సమస్యల పరిష్కారానికి కృషి

**- ఈటల రాజేందర్**

**ముద్ర, హైదరాబాద్ :** మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆర్టీసీ కాలనీ బంజారా నగర్‌లో పర్యటించి ప్రజావాణి నిర్వహించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ కోసం తీసుకున్న భూమికి సంబంధించిన పరిహారంలో రూ.305 కోట్లను కంటోన్మెంట్ ఖాతాలో జమ చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం, స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని చెప్పారు. పోలీస్ పెట్రోలింగ్, సీసీ కెమెరాలు, పార్కుల అభివృద్ధి, చౌరస్తాల విస్తరణ, రోడ్ల నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు వంటి ప్రజల విజ్ఞప్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యులు నర్మదా మల్లికార్జున్, ప్రశాంత్, నరసింహ, మల్లికార్జున్, వై.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లపై కీలక ప్రకటన..

**ఆ రెండు పథకాలను రద్దు చేయబోం**
**ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తాం**
**స్టేపై డివిజన్ బెంచ్ ను ఆశ్రయిస్తున్నాం గత ప్రభుత్వ లోపభూయిష్టమైన జీవో వల్లే చిక్కులు**
**రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**




**ముద్ర , హైదరాబాద్ :** రాష్ట్రంలో కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల అమలుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇవాళ సెక్రటేరియట్‌లో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మొసలి కన్నీరు కారుస్తూ నిరసనలు తెలుపుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా నిధుల విడుదల ఆలస్యమైనప్పటికీ, తాము బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు.

**హైకోర్టు స్టేపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్..**

కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్‌లో పథకానికి సంబంధించి గతంలో జారీ చేసిన 8 జీవోలపై హైకోర్టు ఆగస్టు 12న మధ్యంతర ఆదేశాలు ఇస్తూ సెప్టెంబర్ 9 వరకు నిలిపివేత విధించిందని మంత్రి పొన్నం తెలిపారు. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేయలేదని, కేవలం రాజకీయ పిటిషన్ల కారణంగా స్టే ఇచ్చారని వివరించారు. సెప్టెంబర్ 9 వరకు వేచి చూడకుండా స్టేను తొలగించేందుకు తక్షణమే డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తున్నామని తెలిపారు. 2014లో గత ప్రభుత్వం పథకానికి సంబంధించి లోపభూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ చట్టపరమైన చిక్కులు తలెత్తాయని ఆరోపించారు. కోర్టులో కౌంటర్ ఫైల్ చేయడంలో ప్రభుత్వ న్యాయ విభాగాల లోపమా, అధికారుల జాప్యమా అనే దానిపై అంతర్గత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

**నిధులకు శాసనసభ ఆమోదం ఉంది..**

కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు రాజ్యాంగంలోని ఆర్టికల్–162 కింద లభించిన కార్యనిర్వాహక అధికారాల ద్వారా అమలవుతున్నాయని, ఇవి డెలిగేటెడ్ లెజిస్లేషన్ కావని పొన్నం ప్రభాకర్ వివరించారు. నిధులకు శాసనసభ ఆమోదం ఉందని, ట్రెజరీ నిబంధనల ప్రకారమే నిధులు వెచ్చిస్తున్నందున ప్రజాధనంపై నియంత్రణ లేదనడం సరికాదన్నారు. వివాహానికి 18 ఏళ్లు నిండాలనే నిబంధనతో పాటు ఆర్డీవో, ఎంఆర్ఓ స్థాయిలలో పక్కా వెరిఫికేషన్ వ్యవస్థ ఉందన్నారు. ఆర్టికల్ 46 ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, బలహీన వర్గాల ఆర్థిక పరిపుష్టి కోసమే ఈ నిధులు వెచ్చిస్తున్నట్లు మంత్రి పొన్నం పేర్కొన్నారు.

**ఇప్పటి వరకు రూ.16,375.87 కోట్ల ఖర్చు**

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పథకాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ.16,375.87 కోట్ల ఖర్చుతో మొత్తం 16,78,347 మందికి ప్రయోజనం చేకూర్చినట్లు ప్రభుత్వం కోర్టుకు వెల్లడించిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా రూ.2,734.81 కోట్లతో 2,73,164 మందికి, ఎస్టీ సంక్షేమం కింద రూ.1,801.48 కోట్లతో 1,79,939 మందికి, బీసీ సంక్షేమం ద్వారా రూ.7,803.05 కోట్లతో 7,79,401 మందికి, ఈబీసీ సంక్షేమం కింద రూ.831.70 కోట్లతో 83,074 మందికి, మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రూ.3,204.83 కోట్లతో 3,62,769 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. పేద ఆడబిడ్డల పెళ్లి ఆర్థిక భారాన్ని తగ్గించే ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని, చట్టపరమైన అవరోధాలను దాటుకుని త్వరలోనే పథకాన్ని కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసానిచ్చారు.

# క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

**– కష్టపడ్డ పాత కార్యకర్తలకే పదవుల్లో ప్రాధాన్యం..**
**-ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్..**
**- భువనగిరిలో ముగిసిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ మీటింగ్..**
**- సర్ ఫేజ్-2 ప్రక్రియ, పార్టీ అనుబంధ కమిటీల ఏర్పాటుపై చర్చ**
**- హాజరైన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్**



**ముద్ర, భువనగిరి:** క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరిలోని న్యూ వివేరా హోటల్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది.బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, మండల, గ్రామ, బూత్ స్థాయిలో పార్టీ విస్తరణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. ప్రతి జిల్లాలో పార్టీ పరిస్థితిని సమీక్షిస్తూ సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తున్నామని మీనాక్షి నటరాజన్ తెలిపారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో నిజమైన ఓటరు హక్కు కోల్పోకుండా నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలన్నారు. అలాగే పార్టీ కోసం గతంలో కష్టపడిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.సంస్థాగత నిర్మాణం, నామినేటెడ్ పదవుల భర్తీ, ఓటర్ల నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేయడమే సమావేశం ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

పీఏసీ సమావేశంలో నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నల్లగొండ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు, యూత్ కాంగ్రెస్ , ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళా విభాగాల జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ..



**ముద్ర, హైదరాబాద్:** కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ బీజేపీలో చేరారు. తెలంగాణ భాజపా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. శ్రష్టి వర్మతో పాటు మరికొంతమంది కూడా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులు ఏకమవుతున్న తరుణంలో యువత రాజకీయాల్లోకి రావడం, అందునా భాజపాలో చేరడం హర్షణీయమని ఈ సందర్భంగా రామచందర్‌రావు అన్నారు.

## డాక్టర్ కేర్ హాస్పిటల్స్ : యాంటీబయాటిక్స్‌పై అవగాహనకు 100 రోజుల కార్యక్రమం ప్రారంభం




**ముద్ర, హైదరాబాద్:** యాంటీబయాటిక్స్‌ను అవసరానికి మించి, వైద్యుల సూచనలు లేకుండా వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డాక్టర్ కేర్ హాస్పిటల్స్ 100 రోజుల యాంటీబయాటిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను తాజాగా ప్రారంభించింది. ఆగస్టు 15 నుంచి నవంబర్ 14 వరకు తెలంగాణతో పాటు తెలుగు ప్రజల్లో యాంటీబయాటిక్స్ వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కేర్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ఏ.ఎం. రెడ్డి మాట్లాడుతూ.. యాంటీబయాటిక్స్‌ను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల శరీరంలోని రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు, ఆరోగ్యానికి మేలు చేసే సూక్ష్మజీవులు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మందుల వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యాంటీబయాటిక్స్‌ను స్వయంగా తీసుకోకుండా వైద్యుల సలహాతోనే వినియోగించాలని ఆయన కోరారు.

డాక్టర్ కేర్ క్యాన్సర్ కేర్ డైరెక్టర్ డాక్టర్ గౌరీ శంకర్ మాట్లాడుతూ.. అవసరం లేకుండా ఎక్కువ మొత్తంలో మందులు వినియోగించడం ద్వారా శరీరంపై అనవసరమైన ఔషధ భారం పడుతోందన్నారు. తాను పరిశీలిస్తున్న పలు క్యాన్సర్ కేసుల్లో గట్‌కు సంబంధించిన సమస్యలు కూడా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

డాక్టర్ కేర్ స్కిన్ డైరెక్టర్ డాక్టర్ అమరావతి మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాల్లో యాంటీబయాటిక్స్ సులభంగా లభించడం వల్ల కొందరు వైద్యుల సూచనలు లేకుండానే వాటిని వినియోగిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ లోకేష్, డాక్టర్ పాటిల్, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ శ్వేత, డాక్టర్ అఖిలతో పాటు డాక్టర్ కేర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి మీడియా కో–ఆర్డినేటర్లు సహకరించారు.

ప్రజల్లో యాంటీబయాటిక్స్‌పై అవగాహన పెంచడం, స్వీయ మందుల వినియోగాన్ని తగ్గించడం, వైద్యుల సూచనల మేరకే యాంటీబయాటిక్స్ ఉపయోగించేలా ప్రోత్సహించడం ఈ 100 రోజుల కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డాక్టర్ కేర్ హాస్పిటల్స్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ సాగర్ సింహం తెలిపారు.

## మన ఏరువాక ఫార్మ్స్ పోస్టర్ లాంచ్..

**రైతు నుంచి ప్రతి కుటుంబానికి నాణ్యమైన కూరగాయలు, పండ్లు**




**ముద్ర, హైదరాబాద్ :** “ఆరోగ్యమే మహాభాగ్యం” అని మన పెద్దలు చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, ప్రతి కుటుంబం తీసుకునే ఆహారం నాణ్యమైనదిగా, తాజాదిగా, పరిశుభ్రమైనదిగా ఉండాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. సాక్షాత్తు పెద్దమ్మ అమ్మవారి ఆశీస్సులతో, అమ్మవారి ఆలయ సమీపంలో మన ఏరువాక ఫార్మ్స్ పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త దుండ్ర కుమారస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ దక్షిణ రాష్ట్రాల అధ్యక్షుడు కుర్మారావు, జాతీయ బీసీ దళ్ సంగారెడ్డి అధ్యక్షుడు రక్షణ, ఏరువాక ఫార్మ్స్ పర్యవేక్షణ మరియు పార్ట్నర్ ఏడుకొండలు, పద్మ తదితరులు పాల్గొన్నారు. ఇది కేవలం ఒక సంస్థ పోస్టర్ ఆవిష్కరణ కాదు రైతు కష్టం, ఆరోగ్యకరమైన ఆహారం, వినియోగదారుడి నమ్మకాన్ని కలిపే ఒక కొత్త ఆలోచనకు శ్రీకారం. ఈ సందర్భంగా దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ, “పొలం నుంచి నేరుగా మన కమ్యూనిటీకి, ప్రతి కుటుంబానికి తాజా నాణ్యమైన కూరగాయలను అందించాలనే గొప్ప సంకల్పంతో ఏరువాక ఫార్మ్స్ ఏర్పడటం అభినందనీయమని అన్నారు. స్థానిక రైతుల నుంచి నాణ్యమైన ఉత్పత్తులను సేకరించి వినియోగదారులకు అందించడం ద్వారా రైతు–వినియోగదారుడి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడంతో పాటు, ఇద్దరి మధ్య నమ్మకమైన వారధిగా ఏరువాక ఫార్మ్స్ నిలవాలని ఆకాంక్షించారు.

రైతుకు న్యాయమైన ధర వినియోగదారుడికి నాణ్యమైన ఉత్పత్తి అనే సూత్రం ఏరువాక ఫార్మ్స్‌కు ప్రధాన బలంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

ఏరువాక ఫార్మ్స్ లోగో ఒక గుర్తు మాత్రమే కాదు రైతు ఆత్మగౌరవానికి, స్వచ్ఛమైన ఆహారానికి భరోసా, వినియోగదారుడి నమ్మకానికి ప్రతీకగా నిలవాలి అని దుండ్ర కుమారస్వామి అన్నారు. ఈ ఆలోచన ఒక కమ్యూనిటీ పరిధిలోనే పరిమితం కాకుండా, రైతు–వినియోగదారుడి మధ్య నమ్మకానికి జాతీయస్థాయిలో ఒక ఆదర్శ నమూనాగా ఎదగాలని ఆకాంక్షించారు. “పొలం నుంచి కుటుంబానికి... రైతు కష్టం నుంచి ఆరోగ్యకరమైన ఆహారం వరకు ఇదే మన ఏరువాక ఫార్మ్స్ లక్ష్యం” అని ఆయన పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
మంగళవారం 18.08.2026
4 వేదిక Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# షాడోస్ అండ్ స్టీల్ 2.0

## పాక్, చైనా, అమెరికాకు వణుకే..

ఆధునిక కాలంలో యుద్ధాలు జరిగే తీరు మారింది. దేశాలకు సంబంధించిన భద్రత కూడా సరికొత్త రూపు సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఆయుధాలను సమకూర్చుకోవడం.. యుద్ధ తంత్రాలను అమలు చేయడం అన్ని దేశాలు కొత్త కొత్తగా అమలు చేస్తున్నాయి. ఇప్పటివరకు యుద్ధాలు అంటే.. అత్యాధునిక ఆయుధ సామాగ్రి అంటే మనకు కేవలం అమెరికా.. చైనా దేశాలు మాత్రమే గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు వాటిని మరిపించే విధంగా.. వాటిని అధిగమించే విధంగా తయారైంది ఇండియన్ ఆర్మీ.

ఇండియన్ ఆర్మీ గతంతో పోల్చి చూస్తే అత్యంత శక్తివంతంగా మారింది.. ఆయుధాల విషయంలో.. ఆర్మీ విషయంలో.. యుద్ధ తంత్రాల విషయంలో అత్యాధునిక విధానాలను పాటిస్తోంది. దీనికి సంబంధించి ప్రపంచానికి ఒక టీజర్ విడుదల చేసింది. టీజర్ లోనే ఇండియన్ ఆర్మీ సత్తా ప్రస్ఫుటంగా కనిపించింది. ఆ టీజర్ భారతీయులకు ఆనందాన్ని కలిగిస్తుంటే.. పాకిస్తాన్.. చైనా.. అమెరికాకు వెన్నులో వణుకు పుట్టిస్తోంది.. ఆ టీజర్ లో ఇండియన్ ఆర్మీ ఆధునిక యుద్ధ తంత్రాలు.. సైనిక సామర్థ్యం.. కార్యాచరణ.. సన్నద్ధత వంటివి క్లియర్ గా కనిపిస్తున్నాయి.. దీనికి ఇండియన్ ఆర్మీ షాడోస్ అండ్ స్టీల్ 2.0 అనే పేరును ఖరారు చేసింది. ఆగస్టు 16 ఉదయం 9 గంటలకు దీనిని ప్రారంభించనుంది.. సరికొత్త సైనిక వ్యూహాలను... సాంకేతికత.. ఆపరేషన్ల సన్నద్ధతను ఇందులో చూపించబోతున్నారు. ఇండియన్ ఆర్మీ విడుదల చేసిన ఈ కొత్త ప్రచారానికి సంబంధించిన దృశ్యాలు.. వీడియోలు అద్భుతంగా ఉన్నాయి.

ఇటీవల కాలంలో భారత ప్రభుత్వం ఇండియన్ ఆర్మీని అత్యంత బలోపేతం చేస్తోంది. ఆయుధాల విషయంలో.. ఆర్మీని శక్తివంతం చేసే విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. అత్యంత ఖచ్చితత్వంతో పనిచేసే ఆయుధాలను ఇండియన్ డిఫెన్స్ వింగ్ డెవలప్ చేస్తోంది. అనేక దేశాలతో ఆయుధాల కాంట్రాక్టులు కూడా కుదుర్చుకుంటున్నది. బ్రహ్మోస్ వంటి మిస్సైల్స్ ను విక్రయించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నది. అమెరికా ఆయుధాలు.. చైనా మిస్సైల్స్.. పాకిస్తాన్ బాంబులు విఫలమవుతున్న వేళ.. ఇండియన్ ఆర్మీ రూపొందించిన మిస్సైల్స్ మాత్రం అత్యంత ఖచ్చితత్వంతో దాడులు చేస్తున్నాయి. ఆపరేషన్ సింధూర్ సమయంలో బ్రహ్మోస్ ద్వారా భారత్ చేపట్టిన దాడులు ప్రపంచాన్ని ఆశ్చర్య పోయేలా చేశాయి. అత్యంత ఖచ్చితత్వంతో ఈ మిస్సైల్స్ దాడులు చేయడం.. ప్రాణం నష్టం లేకుండా కేవలం ఆస్తి నష్టాన్ని మాత్రమే కలగజేయడం రక్షణ రంగ నిపుణులను ఆశ్చర్యానికి గురి చేసింది. అప్పటినుంచి ఇండియన్ ఆర్మీ తయారుచేసిన ఆయుధాలకు ప్రపంచ మార్కెట్లలో డిమాండ్ పెరిగింది. అందువల్లే కాంట్రాక్టులు పెరుగుతున్నాయి. వందల కోట్ల నుంచి వేలకోట్లకు ఆయుధాల కాంట్రాక్టులు పెరిగిపోవడం విశేషం. తాజాగా ఇండియన్ ఆర్మీ విడుదల చేసిన టీజర్ ప్రపంచ దేశాలను ఆలోచనలో పడేసింది.. ఇదే దూకుడు కనక ఇండియన్ ఆర్మీ కొనసాగిస్తే.. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యాన్ని కలిగి ఉన్న దేశంగా భారత్ నిలుస్తుంది.



# అమ్మ.. ఎవరికైనా అమ్మే..

ఈ సృష్టికి మూలం అమ్మ. సకల జగత్తుకు ఆది అమ్మ. అమ్మ గురించి చెప్పడానికి.. అమ్మ గురించి వర్ణించడానికి.. అమ్మ గురించి వివరించడానికి మాటలు సరిపోవు. గ్రంధాలు సరితూగవు. పదాలు వివరించలేవు.

ఈ సృష్టిలో అమ్మ ఎవరికైనా సరే అమ్మనే. మనుషుల మధ్య ఎంతటి బలమైన బంధాలు ఉంటాయో.. జంతువుల మధ్య కూడా అలాంటి బంధాలే ఉంటాయి. మనుషులను అమ్మ ప్రేమ ఎలాగైతే కట్టిపడేస్తుందో.. జంతువులని కూడా అలాగే నియంత్రించ కలుగుతుంది. మంచిని నేర్పే అమ్మ ప్రేమ.. చెడును దూరంగా ఉంచుతుంది. ఓటమిని దరిదాపుల్లోకి రాకుండా చేస్తుంది. గెలుపును బానిసగా మార్చుతుంది. అందువల్లే అమ్మ ఉన్నచోట ఆకలి ఉండదు. అమ్మ నిలబడినచోట ఓటమికి ఆస్కారం ఉండదు. అలాంటిదే ఈ వీడియో కూడా..

సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఓ వీడియోలో ఓ చింపాంజీ.. దాని వడిలో బుల్లి చింపాంజీ ఉంది. ఓ పార్కులో చింపాంజీ తన బుల్లి చింపాంజితో కలిసి సేద తీరుతుంది. దానిని చూసేందుకు సందర్శకులు వచ్చారు. అందులో ఒక పాప కూడా ఉంది. ఆ పాపకు చింపాంజీని చూడగానే ముచ్చట వేసింది. ఇంకేముంది దానితో ఆడుకోవాలి అనుకుంది. ఒక ఇనుప బొంగుకు దారాన్ని అటు ఇటుగా ఏర్పాటుచేసి ఒకవైపు బుల్లి చింపాంజీ.. మరోవైపు ఆ పాప లాగడం మొదలు పెట్టింది. ఆ పాప గట్టిగా లాగడంతో గెలిచే దిశగా ప్రయాణం సాగించింది. ఈ క్రమంలో తల్లి చింపాంజీ ఒక్కసారిగా రంగంలోకి దిగింది. ఆ దారాన్ని ఒక్కసారిగా లాగింది.. దీంతో ఆ పాప చేతిలో నుంచి దారం మొత్తంగా తల్లి చింపాంజీ చేతిలోకి వచ్చేసింది. దీంతో చిన్నారి ముఖం మారిపోయింది.

ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా కనిపిస్తోంది. ఈ వీడియో చూసిన వారంతా బాగుందని చెబుతున్నారు. తల్లి ఉన్న చోట బిడ్డకు ఓటమి ఉండదు. ఓటమిని తల్లి అస్సలు ఒప్పుకోలేదు. ముఖ్యంగా బిడ్డ ఓడిపోతుంటే తల్లి అసలు ఓర్చుకోలేదు. మనుషులే కాదు.. చివరికి జంతువులు కూడా తల్లి ప్రేమకు బానిసలే. అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వినిపిస్తున్నాయి.



# ధరా భారత్..!

## స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలా పెరిగాయంటే?

భారత దేశానికి 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. కొత్త యుగంలోకి అడుగుపెట్టింది. అప్పటి నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటి కాలమానంతో చూస్తే నమ్మలేనంత తక్కువగా ఉండేవి. 80 ఏళ్ల స్వాతంత్ర్యంలో ఆర్థికంగా అందరూ ఎదిగారు. కానీ అంకతన్నా ఎక్కువగా ధరలు పెరిగాయి. కొన్ని వస్తువులు సామాన్యుడికి భారంగా మారాయి. కొన్నయితే సామాన్యుడికి అందనంత దూరం వెళ్లిపోయాయి. సంపన్నుల వస్తువులుగా మారాయి. 1947లో 10 గ్రాముల బంగారం కేవలం రూ.88, లీటరు పాలు 12 పైసలు, కిలో బియ్యం 12 పైసలు, లీటరు పెట్రోల్ 27 పైసలు ఉండేవి. ఇవే ఇప్పుడు వరుసగా రూ. 1.55 లక్షలు, రూ.68, రూ.60, రూ. 115 స్థాయికి చేరాయి. ఈ మార్పు ద్రవ్యోల్బణం, ఆర్థిక విధానాలు, జీవన వ్యయం ఎలా మారాయో చూపుతుంది.



### నాడు సంపదకు సంకేతం..

1947లో 10 గ్రాముల బంగారం రూ.88 ఉండేది. ఇప్పుడు అదే పరిమాణం రూ. 1.55 లక్షలకు పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉంది. ఇది వేల రెట్లు పెరుగుదల. బంగారం సంప్రదాయంగా భద్రతా ఆస్తిగా పరిగణించబడుతుంది. ద్రవ్యోల్బణం పెరిగే కొద్దీ ప్రజలు బంగారం వైపు మళ్లడం సహజం. కానీ ఈ ధరల పెరుగుదల సామాన్య కుటుంబాలకు వివాహాలు, పొదుపు లేదా ఆభరణాలు కొనడం కష్టతరం చేసింది. బంగారం ధర ఎగుమతి, దిగుమతి, అంతర్జాతీయ మార్కెట్, రూపాయి విలువలపై ఆధారపడి ఉంటుంది. ఇది దేశ ఆర్థిక స్థిరత్వానికి ఒక సూచికగా కూడా నిలుస్తుంది.

### ఆహార భద్రతపై ప్రభావం..

స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో లీటరు పాలు కేవలం 12 పైసల ఉండేది. ప్రస్తుతం రూ. 68కు, కిలో బియ్యం కూడా 12 పైసల నుంచి రూ.60కు చేరడం ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపుతుంది. 1947లో కుటుంబ బడ్జెట్‌లో ఈ వస్తువులు చాలా చిన్న భాగంగా ఉండేవి. ఇప్పుడు అవి నెలవారీ ఖర్చులో గణనీయమైన స్థానం ఆక్రమిస్తున్నాయి. జనాభా పెరుగుదల, ఉత్పత్తి ఖర్చులు, రవాణా, ప్యాకేజింగ్, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీల మార్పులు ఈ ధరలను నెట్టాయి. బియ్యం, పాలు లాంటి ప్రాథమిక వస్తువుల ధరలు పెరిగితే, పోషకాహారం, పిల్లల ఆరోగ్యం, తక్కువ ఆదాయ కుటుంబాల రోజువారీ జీవనం ప్రభావితమవుతాయి.

### పెట్రోల్ ధర అన్నింటిపై ప్రభావం..

లీటరు పెట్రోల్ నాడు 27 పైసలు ఉండగా, నేడు రూ.115కి చేరింది. ఇది రవాణా ఖర్చులు పెరిగితే వ్యవసాయ ఉత్పత్తులు, వస్తువుల ధరలు, సేవలు అన్నింటిపై ప్రభావం చూపుతోంది. పెట్రోల్ ధర అంతర్జాతీయ ముడి చమురు, కరెన్సీ మార్పిడి, పన్నులు, సబ్సిడీ విధానాలపై ఆధారపడి ఉంటుంది. ఇది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యుడి రోజువారీ ప్రయాణం, వ్యాపారుల లాభాలు, ద్రవ్యోల్బణాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది.

### సామాన్యుడిపై భారం

ఈ ధరల పెరుగుదల ఒక్కసారిగా జరగలేదు. దశాబ్దాలుగా జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, విదేశీ వాణిజ్యం, రూపాయి విలువలో మార్పులు, ప్రపంచ మార్కెట్ ఒడిదుడుకులు కలిసి ఈ స్థితిని తెచ్చాయి. కొనుగోలు శక్తి తగ్గడం, ఆదాయం పెరిగినా ఖర్చులు మరింత వేగంగా పెరగడం సామాన్య కుటుంబాలపై ఒత్తిడి పెంచింది. వేతనాలు, ఉపాధి అవకాశాలు ధరలకు అనుగుణంగా పెరగకపోతే జీవన ప్రమాణాలు ప్రభావితమవుతాయి.

### ఈ రంగాల్లో పురోగతి..

ధరల పెరుగుదల నెగెటివ్ కాదు.. స్వాతంత్ర్యం తర్వాత ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, వ్యవసాయ ఉత్పాదకతలో పురోగతి వచ్చింది. ధరలు పెరిగినా ఆదాయ మార్గాలు, ఉత్పత్తి సామర్థ్యం, సామాజిక భద్రతా వ్యవస్థలు కూడా విస్తరించాయి. అయినా నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి జీవన వ్యయంలో ప్రధాన భాగంగా మారాయి.

1947 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఈ మార్పు భారత ఆర్థిక చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయం. ధరలు పెరిగినా, సామాన్యుడి భారం తగ్గేలా విధానాలు రూపొందించడం పాలకులకు సవాలే.

# లోకేష్ ను కదిలించిన పోస్ట్

Lokesh Nara
@naralokesh

I stumbled upon this video of Ramamurthy garu on Instagram, and it shook me to the core. At his age, the love and devotion with which he continues to care for his elderly mother and differently-abled wife is deeply moving. Ramamurthy garu, your sense of duty towards your family commands my deepest respect. These are the stories of strength and humanity that make Andhra Pradesh proud.

I will personally take care and ensure all benefits are received by the family. Requesting @OfficeofNL to follow up.

@Collectorate_Ks




ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రామమూర్తి గురించి బయట ప్రపంచానికి చెప్పారు. ఇన్ స్టా గ్రామ్ చూస్తున్న నారా లోకేష్ కు అనుకోకుండా ఈ వీడియో కనిపించింది. ఆ వీడియో చూస్తున్నంత సేపు తాను ఎంతగానో భావోద్వేగానికి గురయ్యానని నారా లోకేష్ చెప్పుకొచ్చారు. "నేను ఇన్ స్టా గ్రామ్ లో రామమూర్తి గారి వీడియోను అనుకోకుండా చూశాను. అది నా మనసును తీవ్రంగా కదిలించింది. ఆయన ఈ వయసులో కూడా తన వృద్ధ తల్లిని.. దివ్యాంగురాలైన భార్యను ప్రేమతో చూసుకుంటున్నారు. అంకిత భావాన్ని కనబరుస్తున్నారు. ఆయన చూపిస్తున్న ప్రేమ ఎంతో గొప్పది. రామమూర్తి గారు మీ కుటుంబం పట్ల మీకున్న కర్తవ్య భావన అద్భుతం అంటూ" నారా లోకేష్ ట్వీట్ చేశారు.

నారా లోకేష్ ట్వీట్ చేయడ మే కాదు.. ఏవైనా ప్రభు త్వం తరఫునుంచి అందించే పథకాలు ఉంటే చూడాలని కోనసీమ కలెక్టర్‌కు సూచించారు. దీంతో అధికారులు నేరుగా రంగంలోకి దిగారు. రామమూర్తి కుటుంబం వద్ద కు వెళ్లారు. అతనికి ప్రభుత్వపరంగా ప థకాలు అందించడం మాత్రమే కాకుండా.. ఆ వృద్ధులు సమర్థవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అంతేకాదు రామమూర్తికి ఒక ఇల్లు కూడా నిర్మించి ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతుంది.

నేటి కాలంలో తల్లిదండ్రులను చాలామంది భారంగా భావిస్తున్నారు. కట్టుకున్న భార్యను సరిగ్గా పట్టించుకోవడం లేదు. ఇలాంటి పాడు దినాలలో అతడు ఒక దీపశిఖ. అతను చేస్తున్న పని.. చూపిస్తున్న ప్రేమ.. కనబరుస్తున్న ఆప్యాయత ఎంతో గొప్పది.

బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కి చెందిన రామమూర్తికి 60 సంవత్సరాలకు పైగా వయసు ఉంటుంది. ఇతడికి భార్య.. తల్లి ఉన్నారు. పిల్లల గురించి మాత్రం తెలియదు. రామమూర్తి భార్య సొంతంగా పనులు చేసుకోలేదు. వైకల్యం వల్ల ఆమె పూర్తిగా నీరసపడిపోయింది. ఆమెకు తినిపించాలి. తాగించాలి. చివరికి స్నానం కూడా చేయించాలి. ఇక ఆయన తల్లి పరిస్థితి కూడా అంతే. ఆమెకు కనీసం కూర్చోవడానికి కూడా శరీరం సహకరించదు. వీరిద్దరిని రామమూర్తి కంటికి రెప్పలాగా చూసుకుంటున్నాడు. కన్నబిడ్డల లాగా కాపాడుకుంటున్నాడు.



చదువుతోపాటు

# సంస్కారం అవసరం!

పురుషుల్లో ధీరత్వం పోయి
కామవాంఛ పెరిగిపోతుంది!

స్త్రీల్లో ఉండే మృదుత్వం పోయి
రాక్షసత్వం రగులుకుంటుంది!

కుటుంబం కోసం త్యాగం
చేయాల్సిన మనుషులు
అక్రమ సంబంధాల కోసం
ఒకరినొకరు చంపుకునే
స్థాయికి దిగజారుతున్నారు!

పరువు ప్రతిష్టలు,
బంధాలు, అనుబంధాలు,
ప్రేమలు, త్యాగాలు!

ఇవన్నీ ఇక నిఘంటువుల్లో
మాత్రమే మిగిలిపోతాయా??
మనుషుల్లో కనిపించవా?

రాబోయే రోజుల్లో పరిస్థితి
మరింత దారుణంగా మారకూడదంటే!

ప్రతి విద్యార్థికి చదువుతో
పాటు
సంస్కారం కూడా నేర్పించాలి!

ఏ తప్పుకు ఏ శిక్ష పడుతుందో
వారికి చెప్పాలి!
పాపం అంటే ఏమిటో? పుణ్యం
అంటే ఏమిటో?
ధర్మం అంటే ఏమిటో?
అధర్మం అంటే ఏమిటో?
తెలిసేలా చేయాలి!

ఎందుకంటే?

చదువు మనిషికి జ్ఞానాన్ని
ఇస్తుంది!
సంస్కారం మాత్రమే మనిషికి
మానవత్వాన్ని ఇస్తుంది!

సంస్కారం లేని విద్య!
మనిషిని తెలివైనవాడిని
చేయొచ్చు!
కానీ మంచి మనిషిని
చేయలేదు!

మానవత్వం చచ్చిపోతే!

మనిషిని మనిషే చంపుకుని
తినే రోజులు వస్తాయి!
సంస్కారం లేని విద్య సమాజాన్ని ఎటువైపు తీసుకెళ్తుంది???

# జిల్లేట్ ఎలా పుట్టిందంటే..?

అతని పేరు "క్యాంప్ జిల్లేట్" ఒక పచ్చి తాగుబోతు. అమెరికాలో బోస్టన్ పట్టణంలో పుట్టిన సాధారణ వ్యక్తి. తల్లి సంపాదన మీద బతికే ఒక జులాయి . ఇక అతడికి ఒక దురదృష్టవంతురాలిని చూసి పెళ్లి చేసి తల్లి తన బాధ్యత తీర్చుకోకుండా తన జీతంలో కొం త కొడుకు కి ఇచ్చేది .ఈయన అదృష్టం ఏ మిటంటే భార్య కుడా ఉద్యోగి .కాబటికి పెద్దగా బాధ్యతలు లేవు . తల్లి-పెళ్ళాం ఇద్దరి డబ్బులతో హాయిగా తాగుతు ఇంటికొస్తే తిడతారు అని బోస్టన్ బీచ్ లో పడుకునేవా డు. ఒక రోజు భార్య పుట్టిన రోజు . భార్య పని చేసే కంపెనీ ఉద్యోగులు తన భర్త ను ఆహ్వానించాలని కోరారు.

"క్యాంప్ గిల్లేట్" భార్యతో ఆఫీసు లో బర్త్ డే పార్టీకి రావడానికి 10 డాలర్లు అడిగాడు. తాగడానికి.చేసేదేమి లేక 10 డాలర్ లు రెండు రోజుల ముందే ఇచ్చింది.అయితే రేపు పుట్టిన రోజు అనగా ఆ డబ్బు తో తాగి రావడం తో పెద్ద గొడవ జరిగి మల్లి బీచ్ కు వెళ్లి పడుకున్నాడు.భార్య న్నా మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ తెచ్చుకుంటు బీచ్ లో ఇసుకలో పడుకుని అటు ఇటు మెసులుతుంటే చేతికి ఏదో లోహపు ముక్క దొరికింది .రాత్రంతా ఆ ముక్కను పక్కన ఉన్న రాయికి రాస్తూ భార్య అన్న మాటలకు కోపం తో అలా రాత్రంతా రాస్తూనే ఉన్నాడు . ఇక తెల్లారగానే భార్య పుట్టినరోజు ఇచ్చిన మాట ప్రకారం భార్య ఆఫీసు లో జరిగే పుట్టిన రోజు వేడుకకు హాజరు కావాలి. ఇంటికెళ్లి మాసిన గడ్డం తో అద్దంలో చూసుకుని మెల్లగా రాత్రంతా రాయికి రాసిన ఇనుప ముక్క తో ఒకసారి గడ్డం పై రుద్దగానే నునుపుగా మారిన ఆ లోహపు ముక్క వెంట్రుక మొదళ్ళతో సహా తీసివేసింది. వెంటనే ఒక కమ్మరి దగ్గరకు వెళ్లి దానికి ఒక హ్యాండిల్ చేయించి మొత్తం దాని తో షేవింగ్ చేసుకుని భార్యతో భార్య ఆఫీసుకి వెళ్లి పుట్టిన రోజు ఫంక్షన్ కు హాజరయ్యాడు.

ఆ కంపెనీలో అప్పుడు 300 మంది ఉద్యోగులు అందులో 200 మంది మగవారు. "క్యాంప్ గిల్లేట్" నునుపైన షేవింగ్ చూసి అ ఫంక్షన్ లో ఉన్నవారు అది ఏ విధంగా సాధ్యమయ్యిందో అడిగితే అది ప్రత్యేక పరికరం మీరు ఆర్డర్ ఇస్తే నెను మీకు చేయి ఇవ్వగలను అని చెప్పాడు. ఆ రోజు 100 ఆర్డర్ లు బుక్ అయ్యాయి. తరువాత ఆ నోట ఈ నోట పాకి మొదటి నెల మూడు వేళ ఆర్డర్లు వచ్చాయి. తరువాత తన భార్య పని చేసే కంపని నష్టాలు రావడం తో ఆ కంపెనీ "క్యాంప్ గిల్లేట్" చేరిన పరికరాలు ఉత్పత్తి చేయడం మొదలు పెట్టి ఈ రోజు ప్రపంచంలో ఏ ఊరు పోయిన దొరికే నిత్యావసర వస్తువుగా మారింది . ఇదంత 1901 లో జరిగింది .ఇప్పుడు ఈ గిల్లేట్ కంపెని లాభం కేవలం 1600 కోట్లు ఇండియాలో మాత్రమే. ఇక వేరే దేశాల్లో ఎంత ఉంటుందో అర్థం చేసుకోండి. ఎవరిని తక్కువ అంచనా వేయరాదు .కాలం కల్సి రావాలి అని చేతులు కట్టుకుని కూర్చోవద్దు .ఆ కలిసొచ్చే కాలాన్ని మనమే తెచ్చుకోవాలి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 17.08.2026
www.mudranews.in | @mudranews



**బలహీనత, నీరసంకు తగినంత నీరు తాగాలి:**
రోజంతా తగినంత నీరు తాగడం శరీరంలోని సాధారణ ద్రవ సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. ఎక్కువసేపు కూర్చునే వారు మధ్య మధ్యలో లేచి కదలడం కూడా మంచిది.



# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగించాలి






**ముద్ర, కాప్రా:** కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు హబ్సిగూడ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ ధర్నాలో మాజీ కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి షరతులు, ఆటంకాలు లేకుండా యధావిధిగా కొనసాగించాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సాయి జన్ శేకర్ డిమాండ్ చేశారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాలను కొనసాగించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి పథకాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు.ధర్నా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ప్రభుదాస్, దేవేందర్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కేపీహెచ్‌బీ డివిజన్‌లో..**

**ముద్ర కూకట్పల్లి :** అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సైతం సరిగ్గా అమలు చేయడంలేదని నిరసిస్తూ కేపీహెచ్‌బీ డివిజన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచన మేరకు, కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా రూ. లక్ష ఆర్థిక సాయం అందించారని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఆడబిడ్డలను మోసం చేయడమే కాకుండా, ఉన్న పథకానికే ఎసరు పెడుతూ లబ్ధిదారులకు రావాల్సిన చెక్కులను కూడా అందకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తూ, మరోవైపు పింఛన్లలో కోతలు విధిస్తూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిరీష బాబురావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీ రాజేష్ రాయ్, నాయకులు వెంకటేష్ చౌదరి, పాతూరు గోపి, సాయి శ్రీనివాస్, పవన్, ఉపేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాంబాబు నాయుడు, తులసీ రెడ్డి, వలవల నాయుడు, మాతంగి మల్లేష్‌లతో పాటు మహిళా నాయకులు భారతి, లత, రమాదేవి, బేగం, పద్మ, హేమ, మణి, ఇందిరా, అనూరాధ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్ఠం

**సీ అండ్ డీ వేస్ట్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ప్రారంభించిన జయేష్ రంజన్**



**ముద్ర, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని గౌలిదొడ్డిలో 'రీ సస్టైనబిలిటీ' సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాల బదిలీ కేంద్రాన్ని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధికారికంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎంసీ కమిషనర్ జి. సృజన, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, సెరిలింగంపల్లి సర్కిల్-49 డిప్యూటీ కమిషనర్‌తో పాటు వివిధ ప్రభుత్వ అనుబంధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నగరంలో పెరుగుతున్న నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడానికి, తరలించడానికి మరియు సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ సరికొత్త సదుపాయం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా శేరిలింగంపల్లి ప్రాంతాన్ని మరింత పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన శాశ్వత స్థిరమైన పట్టణ ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.పరిశుభ్రమైన, హరిత మరియు సుస్థిర సెరిలింగంపల్లి నిర్మాణంలో ఇదొక కీలక అడుగు అని గుర్తు చేశారు.

# సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనను జయప్రదం చేద్దాం



**ముద్ర, కాప్రా:** ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్-మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గౌడ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలిరావాలని, ఉదయం స్థానికంగా జయంతి ఉత్సవాలు ముగించుకుని సాయంత్రానికి ర్యాలీగా ట్యాంక్ బండ్ చేరుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిష్ఠాపనకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.గౌడ హాస్టల్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు పాండల శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ 370 ఏళ్ల క్రితమే మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పాపన్న బహుజన రాజ్యాన్ని స్థాపించారని గుర్తుచేశారు. రాష్ట్ర నాయకుడు తాళ్ల వెంకటేష్ గౌడ్ ఆయనను భావితరాలకు స్ఫూర్తిదాతగా అభివర్ణించారు.ఈనెల 18న ఈసీఐఎల్‌లో పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల ఆనంద్ గౌడ్ కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, శోభన్ బాబు, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం



**ఒక మెతుకు కూడా వృధా చేయకండి**
**లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు**

**ముద్ర, కుషాయిగూడ:** మనం తినే ప్రతి మెతుకు పరబ్రహ్మ స్వరూపమని ఒక మెతుకు కూడా వృధా చేయవద్దని లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా మద్దూరి స్వరూప గార్డెన్లో లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320 సి నూతన గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన 11వ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటిలో ప్రతి మెతుకు విలువ కడతామని అదేవిధంగా ఫంక్షన్లలో కూడా బలవంతంగా ఆహారం వేసుకొని వృధా చేయవద్దని తినగలిగినంతనే వేసుకోవాలని తినగలిగినంతనే వడ్డించాలని 50% పైగా అన్నం వృధా చేస్తున్నారని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 50 నుంచి 70% అన్నావ్ కదా అన్నం వృధా అయితే లక్షలాది రూపాయలు నష్టపోవడంతో పాటు మనకు అన్నాన్ని సరఫరా చేసే రైతు కష్టానికి వెలకట్టలేమని ఆయన కష్టానికి వృధా చేసినట్లు అవుతుందని తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. లైన్స్ క్లబ్ ద్వారా సేవలందించడానికి ముందుకు వచ్చి తమ సొంత డబ్బులను ఖర్చు చేస్తూ సేవలను చేస్తున్న లైన్స్ క్లబ్ వారందరినీ అభినందించారు. అట్టి డబ్బులు వృధా కాకుండా పొదుపుతో ఖర్చు చేయాలని సూచించారు. 11వ డిస్టిక్ 320c అధ్యక్షునిగా ఎన్నికైన కళ్లెం కృష్ణారెడ్డి అంతర్జాతీయ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో హాంకాంగ్లో ప్రమాణ స్వీకారం చేయగా, కాప్రా మరో అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ కేజీ రామకృష్ణమూర్తి ఇన్స్టాలేషన్ ఆఫీసర్ గా వ్యవహరించి మొదటి వైస్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మండా సురేష్, రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుంటుక శేఖర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి కళ్లెం మోహన్ రెడ్డి, కోశాధికారి మూలవర్తి శ్రీనివాస్, డిస్టిక్ చీఫ్ కోఆర్డినేటర్ గుడి గంటల రాములు ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మల్టిపుల్ గవర్నర్లు మాజీ గవర్నర్లు కోఆర్డినేటర్లు , మాజీ గవర్నర్లు డాక్టర్ కే హరీష్ రెడ్డి, ఇన్నారెడ్డి, సూర్య నారాయణ, వెంకట నారాయణ రెడ్డి, లైన్స్ సీనియర్లు నాగన్న దత్తు, రీజినల్ చైర్మన్లు ఆర్ శ్రీనివాస్ రెడ్డి , రాజేంద్రప్రసాద్,ఏ టు జెడ్ శ్రీనివాసరెడ్డి, కేసరి శ్రీనివాసరెడ్డి, పెంటయ్య గౌడ్,జోన్ చైర్ పర్సన్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి
పావనిరెడ్డి,సుమలత,రమాదేవి,విజయ్ వాణీ తదితరులు పాల్గొన్నారు..

### కాంగ్రెస్ చిరకాల స్వప్నానికి సాకారం

# తెలంగాణ ఆహార భద్రత

**బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలి**
**మీనాక్షి నటరాజన్**

**ముద్ర, భువనగిరి, ఆగస్టు 17:** పేదల ఆహార భద్రత, ఇళ్లు, వైద్యం, ఓటు హక్కు పరిరక్షణ కాంగ్రెస్ సామాజిక న్యాయ దృక్పథంలో భాగమని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ అన్నారు. భువనగిరిలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.తెలంగాణలో అమలు చేస్తున్న సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఇందిరాగాంధీ, సోనియా గాంధీల సంక్షేమ దార్శనికతకు కొనసాగింపని పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా తొలగిపోకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి బీఎల్ఏ-2 కార్యకర్తల పాత్ర కీలకమన్నారు.2028 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్‌ను బూత్ స్థాయి వరకు పటిష్ఠం చేయాలని, పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లా నుంచి గ్రామపంచాయతీ, బూత్ స్థాయి వరకు సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అద్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకల్లో పాల్గొన్న కేతావత్ భీల్యానాయక్



**ముద్ర, దేవరకొండ :** దేవరకొండ మండలం లోని వడ్త్య తండా గ్రామంలో నిర్వహించిన తీజ్ ఉత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఉపసర్పంచ్ వడ్త్య రఘు నివాసంలో కేతావత్ భీల్యానాయక్‌ను శాలువాతో సత్కరించి, సంప్రదాయ తలపాగా ధరింపజేసి ఘనంగా స్వాగతించారు.ఈ సందర్భంగా కేతావత్ భీల్యానాయక్ మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజనులు ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగ అని అన్నారు. ప్రకృతి అనుగ్రహం, మేఘాలు, వర్షాలు, పచ్చదనం, పక్షుల రాకతో పాటు గిరిజనుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా తీజ్ పండుగను నిర్వహించుకుంటారని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో భాగంగా యువతులు, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ఆనందంగా గడపడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు గ్రామస్తులు ఒకచోట చేరి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా గిరిజనుల ఐక్యత, సంప్రదాయాలు మరింత బలపడతాయని తెలిపారు తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కేతావత్ భీల్యానాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి కళాశాలలో డ్రోన్ ఆధారిత రిమోట్ సెన్సింగ్, ఏఐ శిక్షణ ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** భూగర్భ సర్వేలు, డ్రోన్, సెన్సార్ ఇలా ప్రతి రంగంలో ఎ ఐ ఆధారిత విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర అన్నారు. హైదరాబాద్‌లోని వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం, "జియోస్పేషియల్ మరియు పర్యావరణ అనువర్తనాల కోసం డ్రోన్ ఆధారిత మల్టీ-సెన్సార్ రిమోట్ సెన్సింగ్ మరియు ఏఐ" అనే అంశంపై ఒక వారం పాటు జరిగే ఏఐసీటీఈ శిక్షణ మరియు అభ్యాస, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ను సోమవారం ప్రారంభించింది. డ్రోన్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రిమోట్ సెన్సింగ్, జియోస్పేషియల్ టెక్నాలజీలు మరియు పర్యావరణ పర్యవేక్షణ యొక్క అభివృద్ధి చెందుతున్న అనువర్తనాలపై దృష్టి సారించి, ఈ కార్యక్రమం ఆగస్టు 17 నుండి 22 వరకు నిర్వహించబడుతోంది.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. వి. రమణ , కోశాధికారి శ్రీ ఎం. ఆనంద్ కుమార్ మార్గదర్శకత్వంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి మరియు కోఆర్డినేటర్ డా. కె. రామ్ మోహన్ రావు, డా. హీథర్ సెర్మాతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్, పర్యావరణ పర్యవేక్షణ, పట్టణ ప్రణాళిక, వ్యవసాయం, అటవీ మరియు విపత్తు నిర్వహణ రంగాలలో వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి అధ్యాపకుల నైపుణ్యాన్ని బలోపేతం చేయడం, పరిశోధన మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను స్వీకరించడాన్ని ప్రోత్సహించడం పట్ల వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ యొక్క నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది అని అతిథులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి 3.5 లక్షల ఆర్థిక సహాయంతో స్పాన్సర్ చేసినందుకు ఎ ఐ సి టి ఈ, ఎ టి ఎ ఎల్ అకాడమీకి వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తరుపున నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.మొదటి రోజు "అటవీ బయోమాస్ మ్యాపింగ్ మరియు పర్యావరణ నష్ట అంచనా కోసం ఏఐ మరియు డ్రోన్ ఆధారిత మల్టీ-సెన్సార్ రిమోట్ సెన్సింగ్ విషయాలపై వర్క్ షాప్ నిర్వహించారు.యూనిస్ట్రింగ్ టెక్ సొల్యూషన్స్ సీఈఓ మరియు డైరెక్టర్ కె. శ్రీనివాస రాజు, మరియు ఎన్ఆర్ఎస్సిలోని ఎఫ్ఆర్డి విభాగానికి డిప్యూటీ డివిజన్ హెడ్ మరియు సైంటిస్ట్ డా. సూరజ్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేదల భూముల విషయంలో రేవంత్ రెడ్డి 'రీసెర్చ్ స్కాలర్' అయ్యారు

**ఎంపీ ఈటల రాజేందర్**



**ముద్ర, మల్కాజిగిరి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలనలో అనుభవం లేదని తొలుత భావించామని, అయితే పేదల భూములను లాక్కోవడం, వారి బతుకుల్లో మట్టి కొట్టే విషయంలో మాత్రం ఆయన 'రీసెర్చ్ స్కాలర్'గా మారారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. మేడ్చల్ దుండిగల్ బౌరంపేట్ దళిత రైతులు చేస్తున్న ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి మద్దతు తెలిపి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఎన్నో ఏళ్లుగా కష్టపడి సంపాదించుకున్న భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్నప్పటికీ, ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పేదల చేతిలో కనీసం ఒక గుంట భూమి కూడా మిగలకుండా చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు.పేదల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేసి, బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల హక్కులను కాపాడే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## రాజకీయ ఉనికి కోసమే బీఆర్ఎస్ ధర్నాలు



**ముద్ర, కూకట్పల్లి :** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోందంటూ బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ధర్నాలు కేవలం వారి రాజకీయ ఉనికి కోసమేనని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది.ఈ సందర్భంగా అసలు నిజాలను వెల్లడిస్తూ కాంగ్రెస్ నేతలు ప్రకటన విడుదల చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సరైన చట్టబద్ధత లేకుండా, లోపభూయిష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం వల్లే కోర్టులో ఈ పథకంపై స్టే వచ్చిందని, దీనికి పూర్తిగా గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.గౌరవ హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక స్టే ఆర్డర్ వల్ల మాత్రమే ప్రస్తుతం నిధుల పంపిణీ ఆగింది తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎక్కడా రద్దు చేయలేదని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి 'గ్రీన్ ఛానల్' ద్వారా నిధులను ఎలాంటి ఆలస్యం లేకుండా విడుదల చేస్తూనే ఉందని తెలిపారు.ఈ కోర్టు స్టేపై తమ ప్రభుత్వం వెంటనే డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించి అప్పీల్ చేయబోతోందని, పేద ప్రజలకు న్యాయం జరిగేలా పథకాన్ని యథావిధిగా కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి పథకాలను సక్రమంగా నిర్వహించని బిఆర్ఎస్ నేతలకు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదని, ఇప్పటికైనా డ్రామాలు ఆపి నిజాలు తెలుసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.

## ప్రజలకు బోనాల పర్వదిన శుభాకాంక్షలు

**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ సుమిత్రనగర్ కాలనీలో నిర్వహించిన ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 92 దేవాలయాలకు రూ.30.71 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్, వైద్య సదుపాయాల ఏర్పాట్లు చేసినట్లు గాంధీ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 35 ఫిర్యాదుల స్వీకరణ



**ముద్ర, మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ సంచిత్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల నుంచి ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 35 ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు.సర్కిల్ వారీగా మల్కాజ్‌గిరి నుంచి 7, మౌలాలి నుంచి 10, బోయిన్‌పల్లి నుంచి 1, అల్వాల్ నుంచి 1, కీసర నుంచి 16 ఫిర్యాదులు అందాయి.ప్రజావాణిలో స్వీకరించిన అన్ని ఫిర్యాదులను జోనల్ కమిషనర్ సమీక్షించారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంతో పాటు, ఫిర్యాదుదారులకు త్వరిత గతిన ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకీయా సుల్తానా, సూపరింటెండింగ్ ఇంజనీర్ లక్ష్మణ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 18.08.2026
www.mudranews.in | @mudranews



**బలహీనత, నీరసంకు నడక, తేలికపాటి వ్యాయామం**

ప్రతిరోజూ కొంతసేపు నడక, కాళ్లు–చేతులకు తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోవడం లేదా పడుకోవడం తగ్గించడం మంచిది.



# పాత్రికేయ విలువలకే ప్రాధాన్యం

**- ప్రింట్ మీడియాకు ఢోకా లేదు**
**- వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలి**
**- 'పత్రికా రంగం`నాడు`నేడు' సదస్సులో వక్తలు**
**- జర్నలిస్టుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ కేశినేని**
**- ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ వార్షికోత్సవం**



**ముద్ర, అమరావతి :** సమాజాన్ని చైతన్యం చేయటంలో పత్రికా రంగం కీలకపాత్ర పోషిస్తోందని, పాత్రికేయులు నైతిక బాధ్యతతో విలువలు కలిగిన సమాచారం అందించటానికే ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన 'పత్రికా రంగం`నాడు`నేడు' అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని) ఏపీయూడబ్ల్యూజే లోగో, సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చిన్ని మాట్లాడుతూ వార్త ప్రచురించే ముందు దానికి సంబంధించిన వారి వివరణ తీసుకోవాలని సూచించారు. గతంలో ఉదయం పత్రిక చదివిన తరువాతే ప్రజాప్రతినిధుల కార్యక్రమాలు ప్రారంభమయ్యేవని, ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తరువాత క్షణక్షణానికి వార్తలు మారిపోతున్నాయని చెప్పారు. రెచ్చగొట్టే విధంగా కాకుండా నాణ్యమైన వార్తలు ప్రచురించాలని కోరారు. నాడు వార్త రాస్తే భయపడే రాజకీయ నాయకులు... నేడు వార్తలను పట్టించుకోవటం లేదన్నారు. తెలుగు జర్నలిజం పుట్టిన విజయవాడకు తాను ఎంపీగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి యూనియన్ ప్రతిపాదించిన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి... వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాత్రికేయులను నియంత్రించటానికి చట్టాలు చేశారని గుర్తు చేశారు. ఆధునిక యుగంలో వేగానికి ప్రాధాన్యత పెరగడంతో మీడియా నియంత్రణ పాత్రికేయుల చేతుల్లో లేదన్నారు.

ఐజేయూ సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్ మాట్లాడుతూ తెలుగు పత్రికల్లో వస్తున్న మార్పులు, సాంకేతికత, పెట్టుబడి విధానాలపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. దేశంలో లక్షా ఇరవై ఏడు వేల పత్రికలు ఉన్నాయని తెలిపారు. సాంకేతిక ఐక్యతను జాతీయ మీడియా పట్టించుకోవటం లేదన్నారు. అందువల్లనే మణిపూర్ హింస, లద్దాఖ్ విధానంపై సోనమ్ వాంగ్‌చుక్ చేసిన పోరాటం ప్రాంతీయ మీడియాలోకి రాలేదన్నారు. 58 కోట్ల మంది వాడుతున్న ఇంటర్నెట్ కేవలం ఐదు కంపెనీల చేతుల్లో ఉండడం, అవి కూడా పాలకుల నియంత్రణలో ఉండడంతో వారి రాజకీయ ప్రాధాన్యతకే అవి పని చేస్తున్నాయని చెప్పారు. స్వాతంత్య్ర పోరాటానికి నాడు ప్రధాన పత్రికలు మద్దతివ్వలేదని, వ్యక్తులు ప్రత్యేకంగా నడిపిన పత్రికలే స్వాతంత్ర్య ఉద్యమానికి ఆలంబనగా నిలిచాయన్నారు. అందువల్ల ప్రత్యామ్నాయ మీడియా అవసరం ఎంతో ఉందన్నారు. మీడియా రంగానికి షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట ప్రకారం కార్మికులకు ఉండే చట్టాలే వర్తిసాయన్నారు. రెండేళ్లుగా జర్నలిస్టుల ప్రాతినిధ్యం లేకుండానే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నడుస్తోందన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ వచ్చిన తరువాత యూనియన్లు బలహీనపడ్డాయన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం పునరుద్ధరణ కోసం పోరాడాలని సూచించారు.

ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎస్ ఎన్ సిన్హా మాట్లాడుతూ పూర్వం వార్త రాస్తే తనదే బాధ్యతగా ఉండే వారని, నేడు తనకు ఎలాంటి బాధ్యతలేదనే రీతిలో ఉంటున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా పెయిడ్ న్యూస్ గురించి యూనియన్ చర్చించాల్సి ఉందన్నారు. కార్పొరేట్ రంగం ప్రవేశంతో జర్నలిస్టులు విశ్వసనీయత కోల్పోతున్నారని తెలిపారు. తాను ఫోటోగ్రాఫర్‌గా పని చేసిన కాలంలో జరిగిన విశేషాలను వివరించారు. ఐజేయూకార్యవర్గ సభ్యుడు కూన అజయ్ బాబు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రస్తుతం దేశంలో ఒక్క చట్టం కూడా లేదన్నారు. రద్దయిన 13 చట్టాల్లో రెండు జర్నలిస్టు చట్టాలు ఉన్నాయని చెప్పారు. గతంలో పత్రికారంగం ఒక ఆశయం కోసం పని చేసిందన్నారు. వార్తలు స్వీకరించే స్థితి నుంచి వార్తపై స్పందించే స్థాయిలో పాఠకులు ఉన్నారని చెప్పారు. కార్పొరేట్ రంగ ప్రవేశంతో కొందరు పత్రికలను గుప్పెట్లో పెట్టుకున్నారని, ఈ అంశంపై ఏపీయూడబ్ల్యూజే మార్గనిర్దేశం చేయాలని కోరారు.

ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే 70వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఏడాది పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఉపాధ్యక్షులు చావా రవి, స్వాతి ప్రసాద్, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఏచూరి శివ మాట్లాడు తూ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమానికి ఏపీయూడబ్ల్యూజే చేసిన కృషిని వివరించారు. ఏపీయూడబ్ల్యూజే 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ పాత్రికేయులు ఎస్‌కే బాబును ఘనంగా సన్మానించారు. తొలుత ఎస్ ఎన్ సిన్హా ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని ఆవిష్కరించారు. విజయవాడ అర్బన్ కమిటీ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు అతిథులకు స్వాగతం పలికారు.

## ఆలపాటి సురేష్ కుమారుని వివాహ రిసెప్షన్ కు బాబు



**ముద్ర, అమరావతి :** ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ కుమారుని వివాహ రిసెప్షన్ కు ఆంధ్రప్రదే శ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. విజయవాడ లోని ఎ కన్వెన్షన్ లో సోమవారం రాత్రి వైభవంగా జరిగిన రిసెప్షన్ కు చంద్రబాబు నాయుడు హాజరై నూతన వధూవరులు చార్వాక, సింధురాణి లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మంత్రులు, రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.




## కొండగట్టులో లారీ-బస్సు ఢీ ఘటన పట్ల దిగ్భ్రాంతి

**క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలి**
**ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి**
**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్ :** కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 20 మంది ప్రయాణికులు గాయపడగా, ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను బండి సంజయ్ కోరారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది..

**మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించిన మంత్రి అడ్లూరి..**
**కొండగట్టు రోడ్డు ప్రమాదంపై స్పందించిన మంత్రి లక్ష్మణ్ కుమార్..**



**ముద్ర, ధర్మపురి:** జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద కరీంనగర్ – జగిత్యాల రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కొండగట్టు బస్సు ప్రమాద విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో ఫోన్ లో మాట్లాడారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. రోడ్డు ప్రమాద సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి జిల్లా ఎస్పీని ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు.

## కోరుట్ల లో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల లో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు అందించిన సమాచారం ప్రకారం ఆదివారం రోజు ఒకే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులు అర్ధరాత్రి సమయంలో కోరుట్ల పట్టణంలోని విజయ్ కుమార్ హాస్పిటల్ సమీపం లోని గాంధీ బొమ్మ వద్ద జాతీయ రహదారిపై అత్యంత వేగంగా నడుపుతూ డివైడర్ ను బలం గా ఢీ కొట్టారు. కాగా ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాల పాలైన వారిని పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. కాగా మృతుడు పట్టణంలోని ప్రకాశం రోడ్డు కు చెందిన రాహుల్ గా గుర్తించారు. మిగతా యువకుల్లో ఒకరు రాంనగర్ కు చెందిన సన్నీ కాగా మరోకరు ప్రకాశం రోడ్ కు వర్షిత్ గా గుర్తించారు.

## నిర్మల్‌లో వరుస చోరీలకు చెక్.. ఐదుగురు నిందితుల అరెస్ట్

**25 దొంగతనాలతో ప్రమేయమున్న ఐదుగురు నిందితుల పట్టివేత**

ముద్ర ప్రతినిధి,నిర్మల్: నిర్మల్ జిల్లాలో దేవాలయాలు, ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను నిర్మల్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. టైగర్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక దర్యాప్తుతో సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేరాల వివరాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు.రాజశేఖర్, రాజేశ్వర్, శ్రీకాంత్, రామ్ చరణ్, క్రాంతిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 25 చోరీ కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు 16 కేసులకు సంబంధించిన చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితుల నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, 7.5 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.నిర్మల్ పట్టణంలోని మహాదేవ్ పురం, శాస్త్రినగర్, సోఫీనగర్, గొల్లపేట్ రోడ్, బంగల్ పేట్ ప్రాంతాల్లో జరిగిన ఇంటి దొంగతనాలు, కాపర్ వైర్ చోరీలు, ఆలయ చోరీల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దివ్యనగర్ అయ్యప్ప స్వామి ఆలయం, శాస్త్రినగర్ హనుమాన్ ఆలయంలో వెండి ఆభరణాల చోరీ కేసుల్లోనూ వీరే నిందితులుగా గుర్తించారు. మామడ, కొరిటికల్ ప్రాంతాల్లో జరిగిన ఆలయ చోరీల్లోనూ వీరి పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు.

**ఏపీలోనూ చోరీలు**

నిందితులు ఆంధ్రప్రదేశ్ లోనూ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, ఏలూరు 3 టౌన్ పరిధిలోని వినాయక ఆలయంలో జరిగిన చోరీ కేసుల్లోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మిగిలిన కేసులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది. టైగర్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన తర్వాత గత పది రోజుల్లోనే నిర్మల్ టౌన్, నిర్మల్ రూరల్ పరిధిలో పలు చోరీ కేసులను పోలీసులు ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేశారు. కేసులను సమర్థవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను ఎస్పీ డా. జి. జానకి షర్మిల అభినందించారు.

## నాగబాబుకు పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు

**ముద్ర, అమరావతి :** ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన శాసన మండలి సభ్యుడు కొణిదెల నాగబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్–2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించే దిశగా నాగబాబు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అటవీ విస్తీర్ణం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణకు ఆయన నాయకత్వంలో మరింత వేగంగా చర్యలు సాగాలని పవన్ కళ్యాణ్ కోరారు. నాగబాబును కేబినెట్ హోదాలో నియమించిన సీఎం చంద్రబాబు నాయుడికి, కూటమి నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 225 దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ చిత్రా మిశ్రా, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. అత్యధికంగా కరీంనగర్ నగరపాలక సంస్థకు 58, గృహ నిర్మాణ శాఖకు 56 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 30 రోజులు దాటిన ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లాగిన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. పింఛన్ల దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, అర్హులైన లబ్ధిదారులు ఎవరూ మిస్ కాకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే యూనిఫామ్ పంపిణీలో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

వృద్ధాప్య పింఛన్ మినహా ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు తదితర పింఛన్లకు ప్రస్తుతం దరఖాస్తులు



స్వీకరిస్తున్నట్లు డీఆర్డీఓ గీత, మెప్మా పీడీ స్వరూప రాణి తెలిపారు. కొత్త పింఛన్ల దరఖాస్తులకు ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నామని, నిబంధనల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ప్రతి గ్రామపంచాయతీ, మండల కేంద్రం, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, అవసరమైన పత్రాలు సమర్పించని వారు మాత్రం ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కొండగట్టు సమీపంలో లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**- 5 చిన్నారులు సహా 25 మందికి గాయాలు -**

**ముద్ర, కరీంనగర్ :** జగిత్యాల జిల్లా కొండగట్టు సమీపంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు–లారీ ఢీకొన్నాయి. ప్రమాదంలో 25 మందికి గాయాలు కాగా, క్షతగాత్రుల్లో ఐదుగురు చిన్నారులున్నారు. వీరందరినీ స్థానికులు ఆస్పత్రికి తరలించారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే,బస్సులో 60 మంది ప్రయాణికులు :ప్రమదానికి గురైన బస్సు కరీంనగర్–1 డిపోనకు చెందిన కాగా. దీనిలో సుమారు 60 మందికిపైగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంతో బస్సు డ్రైవర్ మురళి బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్నారు. స్థానికుల సాయంతో ఆయనను బయటకు తీశారు. ఆయనతో పాటు క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ప్రమాదం జరగడంతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. మల్యాల సీఐ రాజ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే గాయపడ్డ వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆస్పత్రికి విచ్చేశారు. దీంతో అస్పత్రి ప్రాంగణమంతా వారి బంధువులతో కిక్కిరిసింది. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని వారంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## పాంబండ క్షేత్రంలో వైభవంగా నాగుల పంచమి

*** పూజ్య గురు హుమేష్ స్వామిజీ ఆధ్వర్యంలో సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు...**
*** సంతాన నాగదేవికి పాలు పోసి మొక్కులు తీర్చుకున్న భక్తులు...**



**ముద్ర చిగురుమామిడి :** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతున్న శ్రీస్వయంభూ పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దివ్య క్షేత్రంలో నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం భక్తిశ్రద్ధలతో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర పరిధిలోని సంతాన నాగదేవి ఆలయంలో పీఠాధిపతి పూజ్య గురు హుమేష్ స్వామిజీ ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి వారికి శాస్త్రోక్తంగా దివ్య అభిషేక పూజా కార్యక్రమాలు జరిగాయి.నాగుల పంచమి సందర్భంగా సంతాన నాగదేవి ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో,ఆధ్యాత్మిక నినాదాలతో మారుమోగింది.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగేంద్రుని పుట్టలో పాలు పోయడానికి మహిళలు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో చిగురుమామిడి మండల ప్రజలతోపాటు కరీంనగర్,హుస్నాబాద్, కోహెడ, సైదాపూర్ మండలాలలోని పలు గ్రామాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. వార్డు సభ్యుడు చెరుకు చిన్నసమ్మయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓరుగంటి భారతీదేవి,భక్తులు రాజిరెడ్డి,తెరాల సత్యనారాయణ,పోటు మల్లారెడ్డి, తెరాల అమర్,బొల్లబత్తిని సంతోష్,దూల్మిట్ట నరసింహారెడ్డి,నరాల రాజయ్య,తదితరులు పాల్గొన్నారు.

**కోరుట్లలో ఘనంగా నాగుల చవితి వేడుకలు**

**ముద్ర, కోరుట్ల;** నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కోరుట్ల పట్టణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పట్టణంలోని మహదేవ ఆలయం, పెద్దమ్మ దేవాలయం, సాయిబాబా మందిరం, అలాగే అర్బన్ కాలనీలోని దుర్గామాత దేవాలయం భక్తులతో సందడిగా మారాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 17.08.2026
www.mudranews.in | @mudranews




### బలహీనత, నీరసంకు పప్పులు, శనగలు:

కందిపప్పు, పెసరపప్పు, శనగలు, రాజ్మా వంటి వాటిలో ప్రోటీన్‌తో పాటు పలు పోషకాలు ఉంటాయి. శరీరానికి అవసరమైన పోషకాలను అందించేందుకు వీటిని సమతుల ఆహారంలో చేర్చుకోవచ్చు.



# సాగునీటి కోసం వైరాలో కదంతొక్కిన రైతాంగం

**ఎస్సై కాళ్లపై పడి రైతు కన్నీరు**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఎండిపోతున్న పంటలను చూసి గుండెకోతకు గురైన ఒక రైతు, తన ఆవేదనను వెళ్లగక్కేందుకు ఏకంగా పోలీసు అధికారి కాళ్లపై పడి కన్నీళ్లు పెట్టుకున్న హృదయవిదారక సంఘటన వైరాలో చోటుచేసుకుంది. వైరా రిజర్వాయర్ నుండి వెంటనే సాగునీటిని విడుదల చేసి, పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట భారీ ఆందోళన నిర్వహించారు.రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని నాయకులు, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు గంటపాటు సాగిన ఈ ధర్నాతో నీటిపారుదల శాఖ కార్యాలయ ప్రాంగణం హోరెత్తింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ నాగ బ్రహ్మయ్య, వైరా ఎస్సై పుష్పాల రామారావు ఆందోళనకారులతో చర్చలు జరిపారు.కన్నీటి పర్యంతమైన రైతు:చర్చలు జరుగుతున్న సమయంలో తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన రైతు బోడేపూడి మాధవరావు భావోద్వేగానికి లోనయ్యారు. లింగన్నపాలెం రెవెన్యూ పరిధిలో తాను నాలుగు ఎకరాల్లో వేసిన వరి పంట నీళ్లు లేక ఎండిపోతోందని ఆవేదన చెందుతూ, ఎస్సై రామారావు కాళ్లపై పడి కన్నీళ్లు పెట్టుకున్నారు. "వెంటనే నీళ్లు ఇచ్చి తమ పంటలను, మమ్మల్ని కాపాడండి" అంటూ ఆయన వేడుకున్న తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలచి వేసింది.ఎల్ నినో ప్రభావం వల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేయలేకపోతున్నామని డీఈ నాగ బ్రహ్మయ్య వివరించగా, నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం రాత్రే కుడి, ఎడమ కాలువలకు రహస్యంగా నీటిని ఎలా విడుదల చేశారని నిలదీశారు. అనంతరం ఎస్సై చొరవ తీసుకుని ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని సద్దుమణగ జేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా కృష్ణార్జునరావు, సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, లాల్ మియా, ప్రజాసంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

**మంత్రుల క్యాంప్ కార్యాలయాల ముట్టడి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు కదంతొక్కారు. ఖమ్మంలోని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల క్యాంప్ కార్యాలయాలను ముట్టడించారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొనగా, పోలీసులు విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకున్నారు.ఈ నిరసనలో పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ సమస్యపై స్పందించక పోవడం దారుణమన్నారు. నిధులు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ల్యాబ్, హాస్టల్, పరీక్ష ఫీజులు చెల్లించలేక చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం దానధర్మాల్లా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలని, కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేయడం తగదని మండిపడ్డారు. రూ.10 వేల కోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పోలీసులు ఆందోళనకారులను విచ్ఛిన్నం చేసి, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి. లక్ష్మణ్, భద్రాద్రి కొత్తగూడెం కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్‌లతో పాటు పలువురు నాయకులను అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వీరభద్రం, సురేష్, హరిచంద్ర ప్రసాద్, రఘు, రామ్ చరణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.




# నాగార్జునసాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

**పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు : మంత్రి తుమ్మల**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు వేసిన పంటలు ఎండిపోకుండా సకాలంలో సాగునీరు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రైతుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా, వారు తక్షణమే స్పందించి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేసేందుకు ఆదేశాలు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 15న బిజ్జి కొత్తూరు వద్ద సీతారామ మోటార్లను ప్రారంభించి, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టు చెరువులకు నీటిని తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.కాలువల్లో నీటి వృథాను అరికట్టేందుకు, లీకేజీలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలన జరపాలని అధికారులను ఆదేశించారు. ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ అధికారులకు సహకరించాలని రైతులను తుమ్మల కోరారు, స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు ఖమ్మం జిల్లా రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# తుంగతుర్తిలో ప్రజావాణికి స్పందన కరువు

**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి స్పందన కరువైంది, ఈ మేరకు ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో చలపతి తాసిల్దార్ దయానంద్ లు తెలిపారు ఇందులో మూడు రెవెన్యూ శాఖకు సంబంధించి ఉండగా రెండు మండల్ పరిషత్ కు సంబంధించినవిగా ఉన్నాయి ఇందులో 23 శాఖల అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు ముఖ్యంగా ప్రజా సమస్యలపై గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను జిల్లాస్థాయిలో వెళ్లకుండా మండల స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం భావించి రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించింది, కానీ ఇట్టి విషయం ప్రజావాణి కార్యక్రమం గురించి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన లేకపోవడంతో పాటు వారికి తెలియక హాజరు కాలేదు, ఇప్పటికైనా అధికారులు గ్రామస్థాయిలో నీ ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహిస్తున్నామని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందిc



# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరత, నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గం, మండల కార్యదర్శుల సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి యువశక్తి అతిపెద్ద సంపద అయినప్పటికీ, యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలి..యువత సమస్యలపై విస్తృత చర్చ జరిపి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉట్కూరి నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, యేశాల అశోక్, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శులు కళ్లేపల్లి మహేందర్, గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, అన్నెమైన వెంకటేష్, మరుపాక వెంకటేష్, దాసరి లక్ష్మయ్య, సలిగంజి వీరాస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండీ నయీమ్ పాల్గొన్నారు.




# ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

**కలెక్టర్ దివాకర్ టీఎస్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (SIR) ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ ముసాయిదా జాబితా వివరాలను వెల్లడించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బి. వేణు గోపాల్, సతీష్ బాబు, ఎం. రమేష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ. గోపాల రావు, జి. సూర్య నారాయణ, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, బీజేపీ ప్రతినిధి వి. రాజేష్, సీపీఎం ప్రతినిధులు డి. తిరుపతి రావు, కె. ప్రకాశం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు, సిహెచ్. నవీన్, బీఎస్పీ ప్రతినిధి వేల్పుల రామయ్యలతో పాటు మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం సూచనల ప్రకారం ముసాయిదా జాబితాను అందుబాటులోకి తెచ్చి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు పేర్కొన్నారు. జాబితాలో వివరాలలో తేడాలు ఉన్నవారికి, మ్యాపింగ్ కానటువంటి ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ధృవీకరణ కోసం సంబంధిత పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో సరిచూసుకోవాలని, అర్హులైన పౌరులు కొత్త ఓటరు నమోదు కోసం ఫారమ్-6, తొలగింపులు లేదా అభ్యంతరాల కోసం ఫారమ్-7, వివరాల సవరణల కోసం ఫారమ్-8 ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు అవగాహన కల్పించి ఈ ప్రక్రియలో సహకరించాలని కలెక్టర్ కోరారు.ఓటరు జాబితాలో పేరు పరిశీలన, దరఖాస్తుల వివరాల కోసం CEO Telangana Official Portal వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, ఇతర సేవలు, మార్గదర్శకాల కోసం Election Commission of India Portal ను ఉపయోగించుకోవచ్చని, సహాయం లేదా సందేహాల కోసం స్థానిక బూత్ స్థాయి అధికారి (BLO) లేదా టోల్-ఫ్రీ నంబర్ 1950 ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 102 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 66, మున్సిపాలిటీ 7,సర్వే ల్యాండ్స్ 6, స్పెషల్ డిప్యూటీ యూనిట్ 4, గ్రామీణ అభివృద్ధి శాఖ 3, ఎస్సీ డెవలప్మెంట్ 2, ఇరిగేషన్ 2, హౌసింగ్ 2, విద్యాశాఖ 2, డిఎల్పిఓ 2, బీసీ సంక్షేమం, వైద్య ఆరోగ్య, చేనేత మరియు జౌళి, ఉపాధి కల్పన, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**డంపింగ్ యార్డు నిర్మాణాన్ని నిలిపి వేయాలి**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను నిల్వ చేసేందుకు అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 326లో చేపడుతున్న డంపింగ్ యార్డు నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళలు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పార్టీలకతీతంగా కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి కె. శ్రీనివాస్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు.

**ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి**

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లెపల్లి మండల కేంద్రంలో ఎంపిడివో కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఎంపిడివో స్వర్ణలత నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రెండు దరఖాస్తులు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఒకటి దరఖాస్తు రావడం జరిగింది. ఈ దరఖాస్తులకు పరిష్కారాలను త్వరలో పరిష్కరిస్తామని ఎంపిడివో స్వర్ణలత, తహశీల్దార్ నరేందర్లు పేర్కొన్నారు.

# త్వరలో బస్వాపూర్ ప్రాజెక్ట్ ఇండ్ల నష్టపరిహారం విడుదల చేస్తాం

**ఆర్ అండ్ ఆర్ కమిషనర్**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బస్వాపూర్ రిజర్వాయర్ లో బిఎన్ తిమ్మాపురం ఆర్ అండ్ ఆర్ ఇండ్ల నష్ట పరిహారం రెండు మూడు రోజుల్లో విడుదల చేస్తామని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి సోమవారం బస్వాపురం రిజర్వాయర్ ను, బిఎన్ తిమ్మాపురం పునరావాస నూతన ఆర్ అండ్ ఆర్ కాలని అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంక రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ, పంచాయతీ రాజ్ ఎస్సి ఆర్డీవో కృష్ణారెడ్డి, ఎమ్మార్వో జగన్మోహన్ ప్రసాద్, బి ఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి, భువనగిరి మాజీ సింగిల్విండో ఛైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఉడుత ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్ రెడ్డి, రావుల నందు, దంతూరి నరసింహ, వల్లందాస్ గండయ్య, మోర నర్సిరెడ్డి, నకిరేకంటి సుధాకర్, నకిరేకంటి రాము, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# గొర్రెలు, మేకల పెంపకందారుల హక్కుల కోసం ఐక్య పోరాటం

**ముద్ర ప్రతినిధి, తుంగతుర్తి:** గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని జీఎంపీఎస్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి ఉప్పుల రమేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో మేడ్చల్ జిల్లా చెంగిచెర్లలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.గొర్రెలు, మేకల పెంపకందారులకు పశువైద్య సేవలు, మేత భూముల పరిరక్షణ, మార్కెట్ సౌకర్యాలు, బీమా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు.కార్యక్రమంలో జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వజ్జ వినయ్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి గుండాల లింగయ్య యాదవ్, మండల కార్యదర్శి బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పై కాంగ్రెస్ కుట్ర

**బీఆర్ఎస్ నిరసన, ఖమ్మం ఆర్డీఓ ఆఫీస్ ముట్టడి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు చూస్తోందని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఖమ్మం ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ సందర్భంగా మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు మేనమామగా అండగా నిలిచేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను నీరుగార్చేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు.సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, కళ్యాణ లక్ష్మితో పాటు 'తులం బంగారం' ఇస్తామని చెప్పి ప్రజలను దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో లబ్ధిదారులకు సకాలంలో చెక్కులు అందేవని, ఇప్పుడు చెక్కుల కోసం పేదలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్నప్పుడు గడపగడపకు వెళ్లి స్వయంగా చెక్కులు అందించారని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ కిట్‌ను రద్దు చేసినట్లే, ఇప్పుడు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కూడా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు, సంక్షేమ పథకాలను కాపాడుకునే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం, కర్నాటి కృష్ణ, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటి, పసుమర్తి రామ్మోహన్, పల్ల రోజలీనా, బీరెడ్డి నాగచంద్ర రెడ్డి, జ్యోతిరెడ్డి, సకీనా తదితరులు పాల్గొన్నారు.






**తుంగతుర్తి మెయిన్ రోడ్డుపై నిరసన**

**ముద్ర, తుంగతుర్తి :** తుంగతుర్తి మెయిన్ రోడ్డుపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా తుంగతుర్తి మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలిచిన పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో తుంగతుర్తి, తిరుమలగిరి మాజీ ఎంపీపీ లు గుండగాని కవిత రాములు గౌడ్,నెమరు గొమ్ముల స్నేహలత, కొమ్మినేని సతీష్, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, తిరుమలగిరి మున్సిపల్ కౌన్సిలర్ లు పనికర లక్ష్మి, సోమలక్ష్మి, శకుంతల, గీత, జ్యోతి, త్రిశూల్, సర్పంచులు చింతకుంట్ల మనోజ్, మేడుదల రమేష్ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు,మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 17.08.2026
www.mudranews.in | @mudranews



### బలహీనత, తిమ్మిర్లకు వరి తవుడు:



వరి తవుడులో ఫైబర్‌తో పాటు కొన్ని బి విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. దీన్ని పరిమిత మోతాదులో ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే తవుడు తినడం వల్ల నరాల సమస్యలు వెంటనే తగ్గిపోతాయని చెప్పడానికి ఆధారాలు లేవు. తుల ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది.

# పేద, మధ్యతరగతి పిల్లలకు నాణ్యమైన విద్య

### కేజీబీవీలు ప్రారంభించిన మంత్రి వివేక్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారంలో రూ.3.25 కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవనాన్ని, చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో 3.25 కోట్లతో నిర్మించిన కేజీబీవీ భవనాన్ని. ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డితో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు.విద్యార్థినిలతో సమావేశమై సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బాలిక విద్యను బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం అనేక రకాల మౌలిక వసతులను కల్పిస్తూ కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేదల పక్షపాతిగా పని చేస్తోందని పేర్కొన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ... కస్తూరిబా గాంధీ విద్యాలయాల ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఇబ్బందులుంటే తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ



పాఠశాలలు అన్ని రకాల మౌలిక వసతులతో విద్యార్థినీ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది, క్రమశిక్షణగా చదువుకుని ఇటు జిల్లాతో పాటు గ్రామానికి కూడా మంచి పేరు తీసుకురావాలని సూచించారు.కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అన్న అంశంపై ఏపీసీలు, కోఆర్డినేటర్లు, డీఈఓ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని అన్నారు.నిరుద్యోగ యువత భవితకు భరోసా... పోర్టల్ ప్రారంభించిన మంత్రి వివేక్ మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో శాంతాబయోటిక్స్ పరిశ్రమలో ఎంప్లాయిమెంట్, స్కిల్స్, ఇండస్ట్రీ కనెక్ట్ పోర్టల్‌నుఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత భవితకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక చేయూతనందిస్తుందన్నారు. మెదక్ జిల్లాలో పోర్టల్ అనేది విద్యార్థులు, ఉద్యోగార్థులు, నైపుణ్య సంస్థలు, స్థానిక పరిశ్రమలలో ధృవీకరించబడిన వ్యవస్థపై అనుసంధానించడానికి జిల్లా స్థాయిలో అభివృద్ధి చేయబడిన ఒక డిజిటల్ వేదిక అన్నారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... జిల్లాలో 100 ఇండస్ట్రీలున్నాయి, నైపుణ్యాలకు అనుగుణంగా ఏ పరిశ్రమలో జాబు పొందాలో వారికి తెలియని పరిస్థితి ఉందని, చాలామంది హైదరాబాదు వంటి నగరాలకు ఉద్యోగాల గురించి వెళ్తున్నారని అలా కాకుండా మన జిల్లాలోని నిరుద్యోగ యువత వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, చైర్పర్సన్ సుబ్బారావు, ఐటిసి ఆనంద్, ఈడీయం సందీప్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలన్నీ అమలు చేస్తాం

### మహిళలకు పెద్ద పీట
### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో
### మంత్రి వివేక్

ముద్ర ప్రతినిధి, మెదక్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని ఉమ్మడి జిల్లా ఇంచార్జి, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మెదక్ కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యే డా. రోహిత్ తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ... గడిచిన రెండున్నర సంవత్సరాలుగా ఒక్కో కార్యక్రమాన్ని ముందుకు



తీసుకెళుతున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినప్పటికీ సన్న బియ్యం ఇస్తున్నట్లు గుర్తు చేశారు. గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు, రుచికరమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు కోట్లాది రూపాయలు వెచ్చించి ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు దర్శనమిస్తున్నాయన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులో అన్ని వివరాలు పొందుపరచడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడ స్మార్ట్ కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు. గతంలో రేషన్ దందా జరిగిందని, ఇక అవకతవకులకు తావు లేదన్నారు. ఖనిజ శాఖలో 700 కోట్ల ఆదాయాన్ని 1000 కోట్లకి పెంచామని, 1400 కోట్ల ఆదాయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆదాయం పెరిగితే పథకాల అమలు సమగ్రంగా చేయవచ్చన్నారు. మహిళలకు 2500 రూపాయలు కూడా త్వరలో ఇవ్వనట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ ఇతర పథకాల ద్వారా ప్రజలకు పరోక్షంగా మేలు జరుగుతుందన్నారు. కథ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్లు అప్పు చేయగా ప్రతినెల 6వేల కోట్ల రూపాయలు వడ్డీ కింద చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. తాజాగా ఆర్థిక పరిస్థితిని బాగా చేసేందుకు సీఎం ఎత్నిస్తున్నారని మంత్రి వివరించారు. ప్రజలు సహకారమస్తే అందిస్తే ప్రభుత్వం మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతుందన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు పెట్రోల్ బంకులు, ఈవి వాహనాలు, బస్సులు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ ద్వారా రాష్ట్రంలో 23 వేల కోట్లు ఇస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందన్నారు. పది ఏళ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, దోచు కోవడానికి దాచుకోవడానికి సరిపోయిందన్నారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రేషన్ కార్డులు పంపిణీ జరుగుతుంది అని, త్వరలో నియోజకవర్గం, మండల స్థాయి లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. స్మార్ట్ కార్డు వల్ల ఎన్నో ఉపయోగాలుం టాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ సువాసినీ రెడ్డి, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ లు కనుగు రాధిక, లావణ్య, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, డీటీ మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కొనసాగించాలి



### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**ముద్ర ప్రతినిధి, మెదక్:**పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపిసూ సోమవారం మెదక్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ ఎత్తున బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో రాస్తారకో, ధర్నా నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డిమాట్లాడుతూ...పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మంది కుటుంబాలకు అండగా నిలిచారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన అవగాహన లేకుండా ప్రజలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ పథకాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ హైకోర్టులో కేసు వేస్తే, ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. అదేవిధంగా రైతులకు యూరియా అందించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకుని, వారికి అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తున్నాయని, వాటిని రద్దు చేయాలని చూస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. ధర్నాలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆరేళ్ళ మల్లిఖార్జున్ గౌడ్, రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ గంగా నరేందర్, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ గడ్డమీది క్రిష్ణా గౌడ్, న్యాయవాది జీవన్ రావు, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మామిండ్ల ఆంజనేయులు, మ్యాదరి దీపక్ కుమార్, జుబేర్ అహ్మద్, మాయా గంగమణి మల్లేశం, రామాయంపేట బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ చౌదరి చరితలతో పాటు మెదక్, రామాయంపేట, పాపన్నపేట, నిజాంపేట, శంకరంపేట మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారావులతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. పోలీసులు వచ్చి ధర్నా విరమింపజేశారు.

# ఒకే డిజిటల్ వేదికపైకి ప్రజారవాణా సేవలు

### మీసేవ ఆధ్వర్యంలో 'మీటికెట్' యాప్ రూపకల్పన
### ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్ సేవలు ఇకపై ఒకే యాప్‌లో..
### .'ఆర్టీసీ సొంతంగా ఆటోలు నడుపుతుంది' అనే వార్తల్లో నిజం లేదు: యాజమాన్యం స్పష్టత




**ముద్ర, హైదరాబాద్ :** ఎప్పటికప్పుడు సరికొత్త ఆలోచనలతో ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందిస్తోన్న టీజీఎస్ ఆర్టీసీ రాష్ట్రంలో ప్రజారవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించింది... ప్రయాణీకులకు వేగవంతమైన, సులువైన సేవలు అందించేందుకు మీసేవ ద్వారా వినూత్నంగా 'మీటికెట్' (MeeTicket) యాప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రయాణ రంగానికి సంబంధించిన అన్ని రకాల సేవలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకురావడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందిస్తున్నారు.'మీటికెట్' యాప్ ముఖ్య విశేషాలు : ఒకే టికెట్‌తో బహుళ ప్రయాణ సౌకర్యం : ఆర్టీసీ (RTC), మెట్రో (Metro), ఆటోలు మరియు క్యాబ్స్ (Cabs) వంటి అన్ని ప్రధాన రవాణా వ్యవస్థలు ఈ యాప్‌లో అనుసంధానమవుతాయి. ప్రయాణీకుడు ఒకే చోట ఆర్టీసీ లేదా మెట్రో టికెట్‌తో పాటు, తన గమ్యస్థానానికి తగినట్లుగా ఆటో లేదా క్యాబ్‌ను కూడా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. చెల్లింపులు సులభతరం – సమయ ఆదా : ప్రయాణికులు చెల్లించిన రుసుమును ఆయా రవాణా విభాగాలు/భాగస్వాములకు ఎప్పటికప్పుడు ఆటోమేటిక్‌గా జమ చేసే ఆధునిక చెల్లింపుల వ్యవస్థ ఇందులో అందుబాటులో ఉంటుంది. 'మీటికెట్' అనేది ఒక ఉమ్మడి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుంది. దీని ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్లతో పాటు ఇతర రవాణాదారులు భాగస్వాములుగా చేరి, ప్రయాణీకులకు నేరుగా సేవలు అందించి లబ్ధి పొందవచ్చు.వినియోగదారుడు తనకు కావలసిన రవాణా విధానాన్ని ఎంచుకుని, ఒకే టికెట్ / యాప్ ద్వారా సమగ్రమైన ప్రయాణ అనుభవాన్ని పొందేందుకు ఈ విధానం దోహదపడుతుంది. అదేవిధంగా ప్రయాణికుడు చెల్లించిన డబ్బు ఆయా రవాణా విభాగాలకు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుంది.'ఆర్టీసీ ఆటోలు నడపబోతోంది అనే ప్రచారానికి తెర : టీజీఎస్ ఆర్టీసీకి అలాంటి ఆలోచన లేదు. "ఆర్టీసీ సొంతంగా ఆటోలను కొనుగోలు చేసి నడుపుతుంది" అని ఇటీవల సోషల్ మీడియా, కొన్ని పత్రికలు, ఇతర వేదికల్లో జరుగుతున్న ప్రచారాలపై ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. ఆర్టీసీ స్వయంగా ఆటోలను కొనుగోలు చేయడం కానీ, వాటిని నిర్వహించడం కానీ చేయదని, భవిష్యత్తులో కూడా అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని యాజమాన్యం తేల్చిచెప్పింది. ప్రయాణీకులు మరియు ఆటో డ్రైవర్లు ఎలాంటి అపోహలకు గురికావద్దని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కోరింది.

## జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి



**ముద్ర, జహీరాబాద్ :** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (NICDIT) వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ (SPV) కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య (Bharat Audyogik Vikas Yojna) పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఖిల్లాపై ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణం చారిత్రక ఖిల్లాపై ప్రత్యేకంగా పోస్టల్ శాఖ రూపొందించిన పోస్టల్ కవర్ ను ఉమ్మడి జిల్లా ఇంచార్జి, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి విడుదల చేశారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎంపి రఘునందన్ రావు, ఎమ్మెల్యే డా. రోహిత్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్, ఆర్డీఓ రమాదేవి, డివైఎస్ఓ రమేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాకతీయుల కాలంలో రెండో ప్రతాపరుద్రుడి ఏలుబడిలో అలరారిన చారిత్రక మెదక్ ఖిల్లా మరోసారి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. మెదక్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతోపాటు సర్కిల్గా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా మెదక్ ఖిల్లా ప్రాముఖ్యతను నలుదిశలా చాటి చెప్పేందుకు దానిపై పోస్టల్ కవర్ ను రూపొందించారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు చారిత్రక కట్టడాలపై పోస్టల్ కవర్లను విడుదల చేయగా..వాటి సరసన మెదక్ ఖిల్లా కూడా చేరింది.పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తాం:మంత్రి వివేక్మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... మెదక్ ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.మెదక్ ఫోర్ట్ స్టాంప్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. మెదక్ ను టూరిజం సెక్టర్ గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపన ప్రతిపాదనలు పంపుతామన్నారు. కేంద్ర టూరిజం శాఖ నుంచి కేంద్రం నుంచి నిధులు రాలేదు, కేటాయించేలా ఎంపీ కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేస్తామన్నారు. నిత్యం ఖిల్లా ఎక్కడం వల్ల మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీయనుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మెదక్ చర్చికి 30 కోట్ల రూపాయలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ... చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాచీన కాలంలో కట్టిన ఖిల్లా పేరుపై పోస్టల్ కవర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గత పాలకులు మెదక్ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యానికి గురి చేశారని, స్వదేశి దర్శన్ ప్రాజెక్ట్ కింద ఖిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు.

## సూర్యాపేట జిల్లాలో
# రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

### ప్రభుత్వ ఆదాయానికి గండి.. నిబంధనలకు తూట్లు

**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అనుమతులు లేకుండానే రాత్రివేళల్లో జేసీబీలతో మట్టి తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరకు మట్టి తీసుకుని బయట ప్రాంతాల్లో వేలాది రూపాయలకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.మట్టి తవ్వకాలు, అధిక లోడుతో టిప్పర్ల రాకపోకల కారణంగా గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని, రాత్రివేళ జేసీబీలు, టిప్పర్ల శబ్దాలతో ప్రజలకు నిద్ర లేకుండా పోతోందని వాపోతున్నారు. అడ్డగోలుగా తవ్వకాలతో భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు పర్యావరణానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ మట్టి రవాణాతో ప్రభుత్వానికి రావాల్సిన పన్నుల ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వకాలపై పర్యవేక్షించాల్సిన మైనింగ్, పోలీస్, రవాణా శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ దందాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, టాస్క్‌ఫోర్స్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.మట్టి మాఫియాపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఉక్కుపాదం మోపి, అనుమతులు లేకుండా తవ్వకాలు, రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అక్రమ దందాను అరికట్టకపోతే ఉద్యమం చేపడతామని పలువురు గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555